

మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంటే.. నవ్యాంధ్రలో స్వర్ణయుగం సాకారం అవుతుంది.సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింది. రాష్ట్రంలో పలుమార్లు అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 2లక్షల పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీదే.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 16.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 146 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# నిరుద్యోగులకు కొలువుల జాతర!



- ఏపీపీఎస్సీ నుంచి 892 పోస్టులకు నోటిఫికేషన్లు
- గ్రూప్-1లో 163 ఉద్యోగాలు.. 20 శాఖల్లో భర్తీ
- అక్టోబరు 6 నుంచి దశలవారీగా దరఖాస్తుల స్వీకరణ
- అత్యధికంగా 196 అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు



**అమరావతి, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు రాష్ట్రప్రభుత్వం భారీగా ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించిన పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ ఏపీపీఎస్సీ మంగళవారం 20 శాఖల్లో 892 పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసింది. నోటిఫికేషన్లను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పోస్టుల వారీగా అక్టోబరు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది.

**గ్రూప్-1లో 163 కొలువులు :** గ్రూప్-1 సర్వీసుల్లో వివిధ విభాగాలకు సంబంధించి 163 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. డిప్యూటీ కలెక్టర్ 11, ఏపీ ట్యాక్స్ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్ 14, డీఎస్పీ (సివిల్) 36, డీఎస్పీ (కమ్యూనికేషన్స్) 3, డీఈవో 14, ఆర్టీవో 3, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ 1, డిప్యూటీ రిజిస్ట్రార్ (కోఆపరేటివ్ సర్వీసెస్) 15, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 12 పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ 2, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ 3, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ 14, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ 35 పోస్టులు భర్తీ చేయనున్నారు. గ్రూప్-1కు అక్టోబరు 6 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

**అక్టోబరు 9 నుంచి మరిన్ని పోస్టులకు దరఖాస్తులు :** అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ 40, హార్టికల్చర్ ఆఫీసర్ 37, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ 8 పోస్టులకు కూడా నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. బీసీ సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ గ్రేడ్-2 ఆఫీసర్ 29, సాంఘిక సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పోస్టులు 21, గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ పోస్టులు 23, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ 6 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు అక్టోబరు 9 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

మిగతా 2లో...


# కొలువుల కోసం.. మరో అవకాశం

- ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ట వయోపరిమితి పెంపు
- 44 ఏళ్ల వరకు దరఖాస్తుకు వెసులుబాటు
- 2027 సెప్టెంబరు 30 వరకు ఉత్తర్వులు అమల్లో
- లక్షలాది నిరుద్యోగులకు ప్రయోజనం

**అమరావతి, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గరిష్ట వయోపరిమితిని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీవో నంబర్లు 187, 188 విడుదల చేసింది. పెంచిన వయోపరిమితి 2027 సెప్టెంబరు 30 వరకు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఏపీపీఎస్సీ , డీఎస్సీతో పాటు ఇతర నియామక సంస్థలు చేపట్టే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలకు ఈ వయోపరిమితి సడలింపు వర్తించనుంది. సాధారణ కేటగిరీ అభ్యర్థులకు యూనిఫాం సర్వీసుల్లో రెండేళ్లపాటు వయోపరిమితి సడలింపు కల్పించగా, ఇతర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గరిష్ట వయోపరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచారు. రిజర్వేషన్ కేటగిరీలకు ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం అదనపు వయోపరిమితి సడలింపులు కొనసాగుతాయని ప్రభుత్వం పేర్కొంది.

ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం వయసు దాటిపోవడంతో లక్షలాది మంది నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారనే అంశాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉపముఖ్యమంత్రి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి చేసిన విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం వయోపరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.



## మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత



- గుండెపోటుతో 57 ఏళ్ల వయసులో తుదిశ్వాస.. ఏలూరులో విషాద ఛాయలు

**విశాఖపట్నం, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ సీఎం, సీనియర్ రాజకీయ నాయకుడు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) ఆకస్మికంగా కన్నుమూశారు.- 2లో...

## మున్సిపల్ ఎన్నికలకు కసరత్తు

- 12 కార్పొరేషన్లు.. 29 మున్సిపాలిటీల్లో ఫొటో ఓటర్ల జాబితాలు
- సెప్టెంబరు 22న వార్డుల వారీగా జాబితాల ప్రచురణ
- జనవరి 1, 2026ను అర్హత తేదీగా పరిగణన
- ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం

2లో

## ఫ్రీహోల్డ్ భూములకు గ్రీన్‌సిగ్నల్

- 7.85 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అనుమతి
- ప్రైవేట్ పట్టా భూములకు ఆంక్షలు తొలగింపు
- అర్హత ఉన్నా ప్రొసీడింగ్స్ రాని భూములకూ వెసులుబాటు
- నిబంధనలకు విరుద్ధమైన భూములపై మాత్రం విచారణ

2లో

## బీసీలకు ఉచిత సివిల్స్ కోచింగ్

- ఏపీ స్టేట్ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ
- 2026-27లో మూడో బ్యాచ్‌కు అవకాశం
- ప్రముఖ సంస్థల నుంచి టెండర్ల ఆహ్వానం
- అక్టోబరు 1న ప్రీ-బిడ్ సమావేశం
- బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు డా. ఏ.మల్లికార్జున

2లో

## రూ.2 వేల దాటితే.. యూపీఐకి కొత్త ఛార్జీ

- యూపీఐ చెల్లింపుల్లో కీలక మార్పులు
- రూ.2 వేలకు మించిన కొన్ని వ్యాపార లావాదేవీలపై 0.4% ఎండీఆర్..
- అక్టోబర్ 15 నుంచి అమలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపుల విధానంలో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. రూ. 2,000కు మించిన కొన్ని వ్యక్తి-వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే కొత్త విధానాన్ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకటించింది. ఈ మార్పులు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే వ్యక్తుల మధ్య జరిగే చెల్లింపులు (పీ2పీ), రూ. 2,000లోపు వ్యాపార లావాదేవీలపై ఎలాంటి ఎండీఆర్ ఉండదని స్పష్టం చేసింది.

కొత్త నిబంధనల ప్రకారం రూ. 2,000కు మించిన పీ2వీ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఒక్కో లావాదేవీకి ఈ ఛార్జీ గరిష్ఠంగా రూ. 300కు పరిమితం కానుంది. ఉదాహరణకు రూ. 2,000 లావాదేవీపై 0.4 శాతం ప్రకారం రూ. 8 ఎండీఆర్ అవుతుంది. ఈ రుసుము వ్యాపారి వైపు వర్తించే ఛార్జీ మాత్రమేనని, వినియోగదారుడి నుంచి నేరుగా వసూలు చేసే చార్జీ కాదని ఎన్‌పీసీఐ పేర్కొంది. ప్రస్తుతం యూపీఐ ద్వారా జరుగుతున్న పీ2వీ లావాదేవీల్లో 95 శాతానికి పైగా రూ. 2,000లోపే ఉన్నందున, అత్యధిక లావాదేవీలపై కొత్త విధానం ప్రభావం ఉండదని తెలిపింది.

**చిన్న వ్యాపారులకు ఊరట :** చిన్నవ్యాపారులకు ఎన్‌పీసీఐ ఊరట కల్పించింది. పీ2పీవీ కేటగిరీలోని చిన్న వ్యాపారులకు జీరో ఎండీఆర్ విధానం కొనసాగుతుంది. యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలో నెలకు రూ. 1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న విక్రేతలు ఈ కేటగిరీలోకి వస్తారు. అయితే రైల్వే, టెలికాం, బీమా, ఇంధనం వంటి

మిగతా 2లో...

## శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు



- ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ
- కుటుంబ సమేతంగా దర్శనం.. పెద్ద శేషవాహన సేవలో పాల్గొన్న సీఎం

**తిరుమల, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీవేంకటేశ్వర స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం సంప్రదాయ వస్త్రధారణలో సతీ సమేతంగా తిరుమలకు చేరుకున్న ఆయనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద మంత్రాల నడుమ అర్చకులు సీఎంకు పరివట్టం కట్టి, పట్టువస్త్రాలను తలపై ఉంచారు. అనంతరం సీఎం దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ప్రభుత్వం తరఫున శ్రీవారికి లాంఛనంగా పట్టువస్త్రాలు సమర్పించడం

మిగతా 2లో...



# అందరికీ ఇల్లు.. ఇదే లక్ష్యం!

- 2029 నాటికి అర్హులైన ప్రతి కుటుంబానికీ పక్కా ఇల్లు
- 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- వచ్చే నెలలోగా మంజూరైన ఇళ్లకు గ్రౌండింగ్
- కేంద్రంతో సమన్వయంతో మరిన్ని ఇళ్లకు కేటాయింపులు



**అమరావతి, సెప్టెంబర్ 15(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గృహ నిర్మాణ శాఖపై క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, పీఎం జన్ మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 1.5 లక్షల ఇళ్లను పట్టణ ప్రాంతాల్లోనూ నిర్మాణం చేయాలని సీఎం సూచించారు. డిసెంబరు 2026 నాటికల్లా 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సీఎం సూచించారు.

మిగతా 2లో...

## యువశక్తితో.. స్వర్ణాంధ్ర



- అక్టోబరు 3న 'పాన్-ఐఐటీ ఏపీ సమ్మిట్-2026'
- 'స్వర్ణాంధ్ర 2047', 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలకు బలమైన బ్లూప్రింట్

2లో

## కోచింగ్ కేంద్రాలపై కొరడా

- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- రాజకీయ ఆందోళనలకు అభ్యర్థులను వినియోగిస్తే సహించం
- అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టమైన



2లో

## నిరుద్యోగులకు కొలువుల జాతర!

(మొదటి పేజీ తరువాయి)

**196 స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు :** తాజా నోటిఫికేషన్లలో అత్యధికంగా 196 అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. వీటికి అక్టోబరు 13 నుంచి దరఖాస్తులు ప్రారంభం కానున్నాయి. మరోవైపు ఏపీ ఎండోమెంట్స్ సబార్డినేట్ సర్వీసెస్‌లో 104 గ్రేడ్-3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటికే 20 శాఖల పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల కాగా, మిగిలిన శాఖల్లో ఖాళీల భర్తీకి కూడా దశలవారీగా నోటిఫికేషన్లు వెలువడనున్నాయి.

## యువశక్తితో.. స్వర్ణాంధ్ర

**అమరావతి, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం చేయడంతో పాటు 'స్వర్ణాంధ్ర 2047', 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల సాధనకు బలమైన బ్లూప్రింట్ రూపొందించే ఉద్దేశంతో అక్టోబర్ 3న విజయవాడలో 'పాన్-ఐఐటీ ఏపీ సమ్మిట్-2026' నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రగతిలో యువతను భాగస్వాములను చేస్తూ, వారి ఆలోచనలు, ప్రతిభ, సృజనాత్మకత, ఆవిష్కరణలకు పెద్దపీట వేయనున్నట్లు చెప్పారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో యువత శక్తి, సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని సీఎం పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రాష్ట్రాన్ని భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేసేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు.

ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, డీప్‌టెక్, స్పేస్‌టెక్, క్లీన్ ఎనర్జీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలపై దృష్టి కేంద్రీకరించనున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడం, పరిశోధనలను ప్రోత్సహించడం, స్టార్టప్‌లకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలు, ఉపాధి మార్గాలు సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

## శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

తన అదృష్టమని స్వామివారి దర్శనం అనంతరం ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురవాలని, భారత్ అగ్రగామి దేశంగా తయారు కావాలని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా మారాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంపదలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామిపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు అపారమైన నమ్మకం ఉందని సీఎం పేర్కొన్నారు. దేశ, విదేశాల్లోని భక్తులు ఒక్కసారైనా శ్రీవారిని దర్శించుకోవాలని కోరుకుంటారని అన్నారు. స్వామివారి సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చక్కటి దర్శన భాగ్యం కల్పించాలని టీటీడీ పాలకమండలిని అధికారులకు సూచించారు. తిరుమలలో క్రమశిక్షణతో కూడిన ఆలయ నిర్వహణ దేశంలోని ఇతర ఆలయాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రీవారి ఆలయాన్ని చక్కగా నిర్వహిస్తున్న పాలకమండలి, అధికారులను అభినందించారు. ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించేలా అందరూ పనిచేయాలని కోరారు.

**పెద్ద శేషవాహనంపై శ్రీమలయప్ప స్వామి దర్శనం:** సాలకట్ల బ్రహ్మోత్సవాల తొలిరోజు తిరుమాడ వీధుల్లో పెద్ద శేషవాహనంపై కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారిని సీఎం చంద్రబాబు దంపతులు దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనం అందించారు. సీఎం సతీమణి భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి శ్రీవారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి ఆలయంలో టీటీడీ రూపొందించిన శ్రీవారి క్యాలెండర్, డైరీ సహా వివిధ ప్రచురణలను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర సహా టీటీడీ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### రూ.2 వేల దాటితే..

## యూపీఐకి కొత్త ఛార్జీ




(మొదటి పేజీ తరువాయి)


కొన్ని నిర్దిష్ట రంగాల్లో రూ. 2,000కు మించిన లావాదేవీలకు శాతం ఆధారంగా కాకుండా ఒక్కో లావాదేవీకి రూ. 5 ఫ్లాట్ ఎండీఆర్ విధించనున్నారు.

**డిజిటల్ చెల్లింపుల విస్తరణకు ప్రత్యేక నిధి :** యూపీఐ మౌలిక సదుపాయాలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కొత్త ఫ్రేమ్‌వర్క్‌లో ప్రతిపాదించారు. ఇప్పటికే యూపీఐని వినియోగిస్తున్న చిన్న వ్యాపారులతో పాటు టైర్-3, అంతకంటే చిన్న మార్కెట్లలోని వ్యాపారులను డిజిటల్ చెల్లింపుల పరిధిలోకి తీసుకురావడం దీని ప్రధాన ఉద్దేశం. ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలోని వివిధ భాగస్వాములకు పంపిణీ చేయడంతో పాటు కొత్త వినియోగదారులు, వ్యాపారులను అనుసంధానించడం, సైబర్ భద్రత, వ్యవస్థ సామర్థ్యం, సాంకేతిక ఆవిష్కరణలకు అవసరమైన పెట్టుబడులకు వినియోగించనున్నారు.

2020 నుంచి యూపీఐపై సున్నా ఛార్జీల విధానం కొనసాగుతుండటంతో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలపై ఆర్థిక భారం పెరుగుతోందని వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఎండీఆర్ ఆదాయంలో కొంత భాగాన్ని యూపీఐ వ్యవస్థ విస్తరణకు వినియోగించనున్నట్లు ఎన్‌పీసీఐ తెలిపింది. క్రెడిట్, డెబిట్ కార్డులు, వాలెట్లతో పోలిస్తే ప్రతిపాదిత ఎండీఆర్ రుసుములు తక్కువేనని పేర్కొంది. అయితే యూపీఐ యాప్‌లు అదనపు ప్లాట్‌ఫామ్ ఫీజులు విధించకుండా నిషేధం కొనసాగుతుంది.

# అందరికీ ఇల్లు.. ఇదే లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)



పీఎంఏవై 1.0, పీఎంఏవై 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద రాష్ట్రంలో 18.72 లక్షల ఇళ్ల మంజూరు కాగా.. ఇప్పటి వరకూ 13.20 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 16.11 లక్షల ఇళ్లకు గానూ ఇప్పటికే 11.31 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గానూ 1.88 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని సీఎంకు వివరించారు. 2027 డిసెంబరు నాటికి 75 వేల కొత్త గృహాలను మంజూరు అయ్యేలా చూడటంతో పాటు 1.5 లక్షల ఇళ్లను పైప్ లైన్ లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనికి సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన కేటాయింపులు పొందాలని సీఎం స్పష్టం చేశారు.

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ :** ఇంటి స్థలాలు లేని కుటుంబాల వాస్తవ డిమాండ్‌ను గుర్తించేందుకు ఆర్టీజీఎస్ సహా ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖల నుంచి డేటాను అనుసంధానం చేసుకుని డూప్లికేషన్ లేకుండా అర్హులను గుర్తించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక లబ్ధిదారుల జాబితాలను ప్రచురించి అభ్యంతరాలను స్వీకరించి పారదర్శకంగా పరిష్కరించిన అనంతరం తుది జాబితాలను ఖరారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లే అవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరానికి అనుగుణంగా 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఖాళీ స్థలాల గుర్తింపు, అర్హులైన లబ్ధిదారులకు మ్యాపింగ్, నిర్మాణం పూర్తయ్యే వం-కు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సీఎం సూచించారు. కుప్పం నియోజకవర్గంలోనూ సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో అందరికీ ఇళ్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

**పారిశ్రామిక టౌన్ షిప్ ల నిర్మాణం :** కేంద్ర సహకారంతో వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక టౌన్ షిప్ లను నిర్మించే అంశంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. రాష్ట్రంలోని శ్రీసిటీ సహా వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని ఈ టౌన్ షిప్‌ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, హౌసింగ్ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కోచింగ్ కేంద్రాలపై కొరడా

**అమరావతి, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. రాజకీయాలకు, రాజకీయ కుట్రలకు ఈ ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు వేదిక కాకూడదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలతో ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు ఈ ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ఒత్తిడి తెస్తున్నట్టు గుర్తించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిబంధనలకు వ్యతిరేకంగా కొన్ని కోచింగ్ సెంటర్లు వ్యవహరిస్తున్న తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దురుద్దేశ పూర్వకంగా కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు తమ వద్ద పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులపై ఒత్తిడి తెచ్చి ఈ తరహా ఆందోళనలకు, నిరసనలకు పాల్పడేలా చేస్తున్నట్టు అధికారులు వివరించారు. పోటీ పరీక్షలకు సిద్ధం చేయాల్సిన అభ్యర్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ఆందోళనలకు వినియోగిస్తున్నట్టు తెలిపారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసమే కొన్ని ప్రైవేటు కోచింగ్ సంస్థల యజమానులు దురుద్దేశంతో అభ్యర్థులను నిరసనలకు, ఆందోళనల కోసం ప్రోత్సహించినట్టు తేలిందన్నారు. ఈ అంశాలపై దృష్టి సారించిన సీఎం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటంపై చర్యలు తీసుకోవాలని సూచనలు జారీ చేశారు. ప్రైవేటు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అభ్యర్థులను రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేస్తే సహించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. వివిధ పోటీ పరీక్షలకు అభ్యర్థులను సిద్ధం చేయాల్సిన ఈ కోచింగ్ కేంద్రాలు కొందరు అభ్యర్థులను రాజకీయ పరమైన ఆందోళనలు, నిరసనల్లో పాల్గొనేలా ప్రేరేపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణా నిబంధనలు 2026 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు జీవో నెంబర్ 9 లోని మార్గదర్శకాలకు అనుగుణంగా నడచుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికి విరుద్ధంగా వ్యవహరించిన ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు మార్గదర్శకాలను పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అటు అభ్యర్థులు కూడా ఎలాంటి ఒత్తిళ్లకూ లోను కాకుండా తమ భవిష్యత్తుపై, పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ వ్యవహారంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచనలు జారీ చేసింది.




## బీసీలకు ఉచిత సివిల్స్ కోచింగ్

**అమరావతి, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ భవన్ నందు గల 'ఏపీ స్టేట్ స్టడీ సర్కిల్' ద్వారా 2026-27 విద్యాసంవత్సరానికి గాను వెనుకబడిన తరగతుల (బీసీ) అభ్యర్థులకు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్ మరియు మెయిన్స్) ఉచిత శిక్షణ (3వ బ్యాచ్) అందించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయటం జరిగిందని సంచాలకులు డా. ఏ మల్లికార్జున తెలిపారు.

ఇందుకు సంబంధించి అర్హత గలిగిన ప్రముఖ శిక్షణా సంస్థల నుండి ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానిస్తున్నారన్నారు. ఆన్‌లైన్ షార్ట్ టెండర్ నోటిఫికేషన్ ఇప్పటికే విడుదల చేయడం జరిగింది అన్నారు. టెండర్ల దాఖలుకు ఈనెల 17 ఆఖరి తేదీ అన్నారు. ఇందుకు సంబంధించిన ప్రీ-బిడ్ సమావేశం అక్టోబర్ 1న నిర్వహిస్తామని, టెండర్ల పరిశీలన మరియు ఖరారు ప్రక్రియ అక్టోబర్ 5న నిర్వహిస్తామన్నారు.

పూర్తి వివరాలకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చునని బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు డా. ఏ. మల్లిఖార్జున ఆ ప్రకటనలో తెలిపారు.

## కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ సస్పెన్షన్ ఎత్తివేత

**అమరావతి, సెప్టెంబరు 15(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై గతంలో విధించిన సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాంతి రాణా టాటాను సెప్టెంబరు 4 నుంచి, విశాల్ గున్నీని సెప్టెంబరు 5 నుంచి విధుల్లోకి తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ముంబై నటి కాదంబరీ జెత్వానీపై ఇబ్రహీంపట్నం పోలీసులు ఫోర్జరీ పత్రం ఆధారంగా కేసు నమోదు చేసిన వ్యవహారంలో అప్పటి ఐపీఎస్ అధికారులు పి. సీతారామాంజనేయులు, కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై ఆరోపణలు వచ్చాయి. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి తప్పుడు పత్రాలు, రికార్డులు సృష్టించి జెత్వానీతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసి వేధించారనే ఆరోపణలపై ప్రభుత్వం అప్పట్లో చర్యలు చేపట్టింది.

# డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు నిరాధారం

- **ఉద్యోగాల కల్పనను ఓర్వలేకే వైసీపీ దుష్ప్రచారం**
- **మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగ నియామకాలు చేపడుతుంటే వాటిని ఓర్వలేక వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని మంత్రి అన్నారు. ఐదేళ్లపాటు ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసిన వారు ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తుంటే విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

స్పోర్ట్స్ కోటా నియామకాలపై కూడా నిబంధనల ప్రకారమే అర్హత, ప్రతిభ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వైసీపీ నేతలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేతలు ముందుగా తమ ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకాలు, అవకతవకలపై ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత ప్రజలను రెచ్చగొట్టేందుకు నిరాధార ఆరోపణలు చేయడం వైసీపీ నేతలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు రావడం, నిరుద్యోగులకు భరోసా కల్పించడం వైసీపీకి ఇష్టం లేదని, అందుకే కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

డీఎస్సీ నియామకాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో ఫిర్యాదు చేయాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని మంత్రి సూచించారు. నిరుద్యోగ యువత ప్రయోజనాలను కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

57 ఏళ్ల నాని మంగళవారం విశాఖపట్నంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. నానికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

1969 డిసెంబరు 30న ఏలూరులో జన్మించిన ఆళ్ల నాని 1994లో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. అదే ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 1999 ఎన్నికల్లోనూ పరాజయం ఎదురైంది. 2004లో టీడీపీ అభ్యర్థి అంబికా కృష్ణపై విజయం సాధించి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004 నుంచి 2013 వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగారు. 2013లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా గెలుపొందిన ఆళ్ల నాని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2024 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం అదే ఏడాది ఆగస్టు 17న వైసీపీకి రాజీనామా చేసిన ఆయన, 2025 ఫిబ్రవరి 13న తెలుగుదేశం పార్టీలో చేరారు.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి :** ఆళ్ల నాని మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాని హఠాన్మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. చిన్న వయసులోనే గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**నాని మృతి బాధాకరం: లోకేశ్ :** ఆళ్ల నాని గుండెపోటుతో మృతి చెందారనే వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. వివాదాలకు దూరంగా, అందరితో స్నేహపూర్వకంగా మెలిగే నాని స్మృతికి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

**పవన్ కల్యాణ్ సంతాపం :** ఆళ్ల నాని ఆకస్మిక మరణం తీవ్ర దుఃఖాన్ని కలిగించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఏలూరు ఎమ్మెల్యేగా మూడుసార్లు, ఎమ్మెల్సీగా ఒకసారి ప్రజలకు నాని సేవలందించారని గుర్తుచేశారు. నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## మున్సిపల్ ఎన్నికలకు కసరత్తు




**అమరావతి, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా మరో 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఈ మేరకు రెండు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

ఫారం-1 నోటీసుతో పాటు వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాలను ఈ నెల 22న ప్రకటించాలని ఎస్ఈసీ ఆదేశించింది. 2026 జనవరి 1ను అర్హత తేదీగా పరిగణించి, తాజాగా రూపొందించిన అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా పురపాలక వార్డుల వారీ ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని సూచించింది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన ప్రక్రియ ముందుగానే పూర్తికావడంతో సెప్టెంబరు 3నే ఓటర్ల జాబితా ప్రచురణ పూర్తయింది. రాష్ట్రంలోని 106 పురపాలక, నగర పంచాయతీల్లో డిలిమిటేషన్ పూర్తయిన 58 చోట్ల కూడా అదే తేదీన జాబితాలను వెల్లడించారు.

మిగిలిన 12 కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియ సెప్టెంబరు 14 నుంచి 17 మధ్య పూర్తికానుంది. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలించిన ఎస్ఈసీ సెప్టెంబరు 22ను ఓటర్ల జాబితాల ప్రచురణ తేదీగా ఖరారు చేసింది. జాబితాల ప్రచురణతో పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఎస్ఈసీ సిద్ధమవుతోంది.

## ఫ్రీహోల్డ్ భూములకు గ్రీన్‌సిగ్నల్

**అమరావతి, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ హక్కులు పొందిన 7,85,500 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లకు కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అసైన్డ్ భూములుగా తప్పుగా నమోదైన 5,422 ఎకరాల ప్రైవేట్ పట్టా భూములకు కూడా ఎలాంటి ఆంక్షలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు ఫ్రీ హోల్డ్ భూములపై మంగళవారం ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

ఫ్రీ హోల్డ్‌కు అర్హత ఉన్నప్పటికీ ప్రొసీడింగ్స్ జారీ కాని 64,143 ఎకరాలకు కూడా ప్రత్యేక ఉత్తర్వులు లేకుండానే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. చుక్కల భూముల చట్టం--2017 పరిధిలోకి వచ్చే 17,897 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చింది. అదే సమయంలో అసైన్‌మెంట్ జరిగి 20 ఏళ్లు పూర్తికాని 28,292 ఎకరాల భూములకు నిర్దేశిత గడువు ముగిసిన తర్వాతే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది.

అయితే నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేసిన 38,733 ఎకరాలు, లబ్ధిదారుల స్వాధీనంలో లేని 25,486 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపివేసింది. ఆయా భూములకు సంబంధించి ఆర్డీవోలు లేదా సబ్ కలెక్టర్లతో సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించింది. వెబ్‌ల్యాండ్‌లో అసైన్డ్ భూములుగా నమోదై ఉండి, అదనపు ఆధారాలు లేని 2,87,53 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలన పూర్తయ్యే వరకు హోల్డ్‌లో ఉంచింది.

ఇక నీటి వనరులు లేదా జల విభాగాలకు చెందని 24,261 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మున్సిపల్ కార్పొరేషన్ల పరిధి వెలుపల ఫ్రీ హోల్డ్ హక్కులు మంజూరు చేసే అధికారాలను ఆర్డీవోలు లేదా సబ్ కలెక్టర్లకు అప్పగించింది. ఆర్డీవో ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే 60 రోజుల్లోగా జాయింట్ కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించింది. ఫ్రీ హోల్డ్ హక్కుల కోసం లబ్ధిదారులు గ్రామోద్యోగ/స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-I ఉచిత శిక్షణ

- దరఖాస్తుకు ఈ నెల 25 వరకు గడువు పెంపు
- మైనారిటీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి
- మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు



**అమరావతి,సెప్టెంబరు 15(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్-2026ను అనుసరించి గ్రూప్-I పరీక్షలకు పోటీపడే మైనారిటీ అభ్యర్థులను ఉచిత శిక్షణకు ఎంపిక కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కు దరఖాస్తు గడువును మరోసారి పెంచినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం ) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని మంత్రి గుర్తు చేశారు. ఈనెల 10వ తేదీ వరకు నిర్దేశించిన గడువు ను 15 వ తేదీ వరకు పొడిగించిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. అయితే ఈ గడువును మరోసారి పెంచి ఈనెల 25వతేది వరకు దరఖాస్తు చేయడానికి పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అదనపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పొడిగించిన గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 సివిల్ పరీక్షకు హాజరుకావాలనుకునే మైనారిటీ అభ్యర్థులకు శ్రేష్ఠమైన శిక్షణ, మార్గదర్శకత్వం, సహకారాన్ని అందించడమే ఉచిత శిక్షణా కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మరిన్ని వివరాల కోసం సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం),మైనారిటీ సంక్షేమ శాఖ,వెబ్‌సైట్: https://apcedmmwd.org ఫోన్: 08645-297535 / 7386789966. సంప్రదించాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

# ట్రామాడోల్ దుర్వినియోగంపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు

- 100 మందుల దుకాణాల్లో తనిఖీలు.. 55 చోట్ల నిబంధనల ఉల్లంఘనలు
- జంగారెడ్డిగూడెంలో భారీగా ట్రామాడోల్ ఇంజెక్షన్లు స్వాధీనం.. ఐదుగురి అరెస్టు
- మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు






**జంగారెడ్డి గూడెం (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రవ్యాప్తంగా 100 మందుల దుకాణాల్లో నిర్వహించిన తనిఖీల్లో 55 చోట్ల నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయి. ట్రామాడోల్, ఇతర కఠిన నిబంధనలున్న మందుల కొనుగోలు, విక్రయాల్లో ఈ అక్రమాలు గుర్తించారు. వీటిలో 53 చిన్నస్థాయి ఉల్లంఘనలు కాగా, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు చోట్ల పెద్ద మొత్తంలో మందుల కొనుగోలు, విక్రయాలు జరిగినా సంబంధిత బిల్లులు చూపించలేదు. అధికారులు కొనుగోలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వానికి అందిన సమాచారం మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలతో ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో గుర్తించిన అంశాలతో అధికారులు మంత్రి సత్యకుమార్‌కు నివేదిక అందజేశారు.

**జంగారెడ్డిగూడెం నుంచి వెలుగులోకి..**: ఈ రాష్ట్రవ్యాప్త తనిఖీలకు దారితీసిన ఘటన జంగారెడ్డిగూడెంలో వెలుగుచూసింది. వేగవరం గ్రామంలోని ఆయిల్‌పామ్ తోటలో పెద్ద సంఖ్యలో ఖాళీ, పగిలిన ఇంజెక్షన్ సీసాలు, వాడిన సిరంజీలు కనిపించడంతో జంగారెడ్డిగూడెం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లికార్జున్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. అవి ట్రామాడెక్స్, ట్రామెక్ పేర్లతో ఉన్న ట్రామాడోల్ ఇంజెక్షన్లుగా గుర్తించారు.

ట్రామాడోల్‌ను తీవ్రమైన నొప్పిని తగ్గించేందుకు వైద్యపరంగా ఉపయోగిస్తారు. అయితే మత్తు కలిగించే ప్రభావం ఉండటంతో కొందరు దీనిని మాదకద్రవ్యాలకు ప్రత్యామ్నాయంగా దుర్వినియోగం చేస్తున్నారు. అందువల్ల వైద్యుల సూచన మేరకు, నిబంధనల ప్రకారం మాత్రమే ఈ మందును విక్రయించాలి. అయితే కొందరు మందుల దుకాణాల నిర్వాహకులు మధ్యవర్తులతో కలిసి సరైన బిల్లులు, రికార్డులు లేకుండా విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

**భారీగా ఇంజెక్షన్ల కొనుగోలు..**: దీంతో ట్రామాడోల్ తయారీ సంస్థల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పంపిణీ వివరాలను అధికారులు సేకరించి పరిశీలించారు. జంగారెడ్డిగూడెం ప్రాంతంలోని కొన్ని మందుల దుకాణాలు పెద్ద మొత్తంలో ట్రామాడోల్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దీంతో శ్రీ లక్ష్మీ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ, డి.రూప పెడ్డింటి మెడికల్ ఏజెన్సీల్లో తనిఖీలు నిర్వహించారు.

శ్రీ లక్ష్మీ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ ఈ ఏడాది రెండు బిల్లుల ద్వారా 20 వేల ట్రామాడోల్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. అయితే వాటి విక్రయ బిల్లులు, నిల్వ వివరాలను చూపించలేదు. విచారణలో నాలుగు పెట్టెల ట్రామాడెక్స్ ఇంజెక్షన్లను స్నేహితుడి చెక్కపనుల దుకాణంలో దాచినట్లు బయటపడింది. అక్కడ తనిఖీ చేయగా 7,550 ఇంజెక్షన్లు లభించడంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇంజెక్షన్లను జంగారెడ్డిగూడెం, మేడ్యానపు వరిగూడెం, వేగవరం, కుక్కునూరు తదితర ప్రాంతాల్లోని దుకాణాలు, వ్యక్తులకు సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది.

**నకిలీ బిల్లులతో మరో వ్యవహారం..**: మరోవైపు డి.రూప పెడ్డింటి మెడికల్ ఏజెన్సీ గత రెండేళ్లలో 5,200 ట్రామెక్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిలో 3,930 ఇంజెక్షన్లను తెలంగాణలోని ఓ మందుల దుకాణానికి విక్రయించినట్లు బిల్లులు చూపించారు. అయితే తెలంగాణ అధికారులు ఆ లావాదేవీ నకిలీదని గుర్తించారు.

నకిలీ బిల్లులు తయారు చేసి, వాస్తవానికి ఆ మందులను ఇతర దుకాణాలకు బిల్లులు లేకుండా సరఫరా చేసినట్లు విచారణలో బయటపడింది. ఈ వ్యవహారంపై డ్రగ్స్ నియంత్రణ శాఖ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జంగారెడ్డిగూడెం పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి జైలుకు పంపారు. అరెస్టయిన వారిలో మందుల దుకాణాల యజమానులు, ఒక ఉద్యోగి ఉన్నారు.

**అక్రమ లావాదేవీలపై చర్యలు..** : జంగారెడ్డిగూడెం ఘటనతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన తనిఖీల్లో వెలుగుచూసిన అక్రమాలపై ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ తదుపరి చర్యలకు సిద్ధమైంది. పెద్ద మొత్తంలో అక్రమ లావాదేవీలు చేసిన మందుల దుకాణాల లైసెన్సులు రద్దు చేసేందుకు చర్యలు చేపడుతోంది.

ట్రామాడోల్ లేదా ఇతర కఠిన నిబంధనలున్న మందులను అక్రమంగా తరలించడం, అనుమతి లేకుండా నిల్వ చేయడం, సరైన రికార్డులు లేకుండా విక్రయించడం వంటి చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. పోలీసులతో, ఇతర అమలు సంస్థలతో కలిసి దర్యాప్తు కొనసాగిస్తూ, రికార్డుల పరిశీలన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు పేర్కొన్నారు.

# బాల సంజీవనిలో డ్వాక్రా మహిళలను భాగస్వామ్యం చేయాలి



**కడప (జర్నలిస్ట్ ఫైల్ ):** స్వయం సహాయక గ్రూపులను న్యూట్రిషన్ స్కీం లో భాగస్వామ్యం చేయాలని సుప్రీంకోర్టు చెప్పినా పట్టించుకోని అధికారులు పోషణ 2.0 గైడ్లైన్స్ ను అమలు చేయకపోవడంతోపాటు బాలసంజీవని టెండర్లలో గోల్మాల్ నిబంధనలు తుంగలో తొక్కుతూ ఐదు మంది పెద్దలకే కాంట్రాక్టర్ ఇవ్వడాన్ని తక్షణమే విరమించుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో డిఆర్ఓ మల్లికార్జునుడు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెద్దల్లపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.....ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు బాల సంజీవని మరియు బాల సంజీవని ట్రైబల్ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 26 జిల్లాలను నాలుగు యూనిట్లుగా విభజించి టెండర్లు పిలిచారు. ప్రతి యూనిట్కు సగటున 12,000 నుండి 14,000 అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలి. ఒక్కో లబ్ధిదారునికి నెలకు 2 కిలోల రాగి పిండి, బెల్లం చిక్కీ ఖర్జూరం అటుకులు కలిపిన కిట్ ఇస్తారు. ట్రైబల్ ప్రాంతాల్లో మల్టీగ్రెయిన్ ఆటా కూడా ఇస్తారు. రాష్ట్రంలోని 53,787 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 26 జిల్లాల్లో నెలకు 4,52,140 మంది తల్లులకు, చిన్నారులకు, సంవత్సరానికి 54,25,680 కిట్లు అందించాలన్నదే ప్రభుత్వ ఆశయం. కానీ ఆ ఆశయానికి బడా కాంట్రాక్టర్లు, అధికారులు, కొందర పెద్దలు కలిసి తూట్లు పొడుస్తున్నారు. రూ. 241 కిట్ నేడు రూ. 283.19 అయింది. రూ. 350 ట్రైబల్ కిట్ నేడు రూ. 446 అయింది. తయారీ చేసే వాడిని తొలగించి, తయారీ యూనిట్ లేని వాడికి కాంట్రాక్టు ఇచ్చారు. 5,583 పాయింట్ల నిబంధనతో చిన్నోడిని తప్పించి, 12 వేల పాయింట్లు చూపిన పెద్దోడికి కట్టబెట్టారు. గత ఐదేళ్లుగా యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నప్పటికీ పాలకులు చోద్యం చూస్తూ ఉండిపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఏపీ ట్రాన్స్పరెన్సీ యాక్ట్ ప్రకారం అందరికీ సమాన అవకాశం ఇవ్వాలి. కానీ పాయింట్ల నిబంధన పెట్టడం వల్ల సమాన అవకాశం లేకుండా పోయింది. సివిసి గైడ్ లైన్స్ ప్రకారం తయారీ అనుభవం లేని వారికి కాంట్రాక్టు ఇవ్వకూడదు. కానీ కేంద్రీయ భండార్కు ఇచ్చారు.

ఒక్కో జోన్ లో కనీసం 5,583 డెలివరీ పాయింట్లకు సప్లయ్ చేయాలనే నిబంధన పెట్టడం ద్వారా గతం నుంచి వస్తున్న బడా కంపెనీలే క్వాలిఫై అ-య్యారు. కొత్తగా వచ్చే వారు రాకుండా సిండికేట్ చేయించారనే విషయం దీని ద్వారా తెలుస్తుంది. వాస్తవానికి 5,583 కాదు 12,000 నుంచి 14,000 పాయింట్లకు సప్లయ్ చేయాలి. ఇది చిన్న వారు చేయలేరు.

సప్లిమెంటరీ న్యూట్రీషన్ రూల్స్ 2017లోని రూల్ 9 ప్రకారం రాష్ట్రప్రభుత్వం ఎస్ హెచ్ జి ల నియామకం ద్వారా సప్లిమెంటరీ న్యూట్రిషన్ సరఫరా నాణ్యతను నిర్ధారించాలి. ఎసాచిల నియామకం జరిగే వరకు మాత్రమే తాత్కాలికంగా ఇతర ఏజెన్సీలకు ఇవ్వాలి. కానీ బాల సంజీవని టెండర్ (2025-26) లో ఎసాచిల ప్రస్తావనే లేదు. 5,583 పాయింట్ల నిబంధనతో ఎస్ఎచిలను దూరం పెట్టారు. 7 ఏళ్లుగా అదే కాంట్రాక్టర్లకే ఇవ్వడం రూల్ - 9 ప్రొవిసన్ ను శాశ్వతంగా దుర్వినియోగం చేయడమే. ఇది చట్టవిరుద్ధం. బాలల పౌష్టికాహారం పెద్ద కాంట్రాక్టర్ల లాభాల కోసం కాదు. స్థానిక మహిళా సంఘాల భాగస్వామ్యంతో వికేంద్రీకృతంగా పారదర్శకంగా, నాణ్యతతో అందించాలన్నదే కేంద్ర విధానం.

కావున కేంద్రీయ భండార్, ఎన్సిసిఎఫ్ కాంట్రాక్టులను రద్దు చేయాలి. జోన్ విధానం రద్దుచేసి జిల్లాల వారీగా పిలవాలి. తద్వారా స్థానికంగా ఉపాధి పెరుగుతుంది. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా స్వయం సహాయక గ్రూపులకు ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధ్యానం ఇవ్వాలి. అందరికీ సమాన అవకాశాలు ఇచ్చేలా టెండర్ ప్రక్రియ చేపట్టాలి. రూ. 446 మరియు రూ. 283.19 రేట్లను రద్దు చేసి పాత రేట్లు రూ. 350 మరియు రూ. 241 కు రీటెండర్ వేయాలి. రేట్లు పెరిగితే వాటికి సరైన ఆధారాలు చూపించాలి. మన యూనిట్లకు ఎందుకు వర్క్ ఆర్డర్లు ఇవ్వలేదో చెప్పి, స్థానిక చిన్న తరహా సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పూర్తిస్థాయి సమగ్ర విచారణ జరిపించేందుకు తగు తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివశంకర్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాహుల్ జిల్లా నాయకులు గుడిమె సురేష్ నాగార్జున సుమంత్ పాల్గొన్నారు

# సమాజ ప్రగతిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

- భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే
- వీసీ డా. పులాల చంద్రశేఖర్, రిజిస్ట్రార్ సాయి సుధీర్ ఇంజినీర్లకు శుభాకాంక్షలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : దేశ నిర్మాణం, సాంకేతిక అభివృద్ధి, సమాజ పురోగతిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని డా. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి డా. పులాల చంద్రశేఖర్, రిజిస్ట్రార్ సాయి సుధీర్ పేర్కొన్నారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఇంజినీర్స్ డే సందర్భంగా విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని, ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఇంజినీరింగ్ రంగానికి ఆయన చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న ఇంజినీర్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

వీసీ డా. పులాల చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దూరదృష్టి, క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం దేశ అభివృద్ధికి చిరస్మరణీయమైన సేవలను అందించాయని అన్నారు. ఆయన చూపిన మార్గం నేటి ఇంజినీర్లకు ఆదర్శమని పేర్కొన్నారు. ఇంజినీర్లు తమ సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆలోచనలతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ దేశ నిర్మాణంలో కీలక భాగస్వాములుగా నిలుస్తున్నారని అన్నారు.

రిజిస్ట్రార్ సాయి సుధీర్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన అంకితభావం, కార్యదక్షత, ఇంజినీరింగ్ ప్రతిభ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల అవసరాలకు అన్వయిస్తూ సమాజానికి మెరుగైన పరిష్కారాలను అందించడంలో ఇంజినీర్ల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు.

ఈ సందర్భంగా డా. పులాల చంద్రశేఖర్, సాయి సుధీర్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్న ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి, మౌలిక వసతుల నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలు సజావుగా సాగడంలో వారి కృషి, నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ఇంజినీర్లు తమ జ్ఞానం, నైపుణ్యాన్ని సమాజ శ్రేయస్సు, దేశాభివృద్ధికి వినియోగించాలని వీసీ, రిజిస్ట్రార్ ఆకాంక్షించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్, సాంకేతిక సిబ్బందితో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరించాలని మండలంలో రిలే నిరాహార దీక్షలు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం మండలం లింగాలదిన్నె పల్లె ఎస్టికాలనీ వాసులకు భూపంపిణీ చేసిన పలుగురాళ్లపల్లే రెవిన్యూ పొలంలోని 1938 సర్వే నంబర్లో పేదలను సాగు చేయకుండ నోటీసులు పంపిన రెవెన్యూ అధికారులకు కబ్జాదారులను సాగు చేయకుండ అడ్డుకునే ధైర్యం ఉందా అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్ ప్రశ్నించారు.

మంగళవారం అసైన్డ్ భూముల రక్షణ కమిటీ( వ్యవసాయ కార్మిక సంఘం అనుబంధం )ఆధ్వర్యంలో బి.మఠం తహసిల్దార్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. దీక్షలను ప్రారంభించిన శివకుమార్.అన్వేష్ లు మాట్లాడుతూ 1938 సర్వేనెంబర్ నందు లింగాలదిన్నెపల్లె ఎస్టి,బిసి కులాలకు చెందిన 74 మంది భూమిలేని పేదలకు అసైన్డ్ మెంట్ కమిటీ నందు నిర్ణయించి పట్టాలు పంపిణీ చేసి సబ్ డివిజన్ చేసి మ్యాపు గీసి, భూమి స్వాధీన పత్రాలు కూడా అందజేశారని ఆ భూమిలో 14 సంవత్సరాలుగ సాగు చేసుకుంటున్నారని ఇప్పటికిప్పుడు కబ్జాదారులు వచ్చి అడ్డుకుంటుంటే వారి మీద కేసులు పెట్టి పేదలకు రక్షణ కల్పించాల్సిన రేవిన్యూ అధికారులు భూముల్లోకి దిగితే చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇవ్వడం విడ్డురంగఉందని వారు విమర్శించారు, ఇదే సర్వే నంబర్ నందు కొంతమంది రాజకీయ పలుకుబడి కలిగిన వారు పదులు ఎకరాలను ఆక్రమించి యదేచ్చగా పంటలు పండించుకుంటూ ఉంటే వారిని అడ్డుకొని రెవిన్యూ అధికారులకు కబ్జాదారుల నుండిఎన్ని లక్షల రూపాయలు ముడుపులు అందాయో అని వారు విమర్శించారు.

2011లో భూమి హద్దులు చూపి భూమి స్వాధీన పత్రాలు మంజూరు చేసి ఇప్పటివరకు పాస్ పుస్తకాలు మంజూరు చేయకుండా ఆన్లైన్ చేయకుండ రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యంగ వ్యవహరించారని వారు చేసిన తప్పులకు పేదలు బలి అవుతున్నారని వారు విమర్శించారు. వెంటనే 1938 సర్వే నంబర్లో ఎస్టీ కాలనీవాసులు అనుభవంలో ఉన్న భూములను వారికి ఆన్లైన్ చేయాలని అదేవిధంగా ఇదే సర్వే నంబర్లో ఉన్న జోకుపల్లి, పలుగురాళ్లపల్లె గ్రామాలలోని అసైన్డ్ మెంట్ లబ్ధిదారుల డీకేట్ పట్టాల భూమికి హద్దులు చూపించాలని వారు డిమాండ్ చేశారు, సమస్యను పరిష్కరించేంతవరకు దీక్షలను విరమించే ప్రసక్తే లేదని రిలే దీక్షలను ఉధృత రూపంలోకి తీసుకెళ్తామని వెంటనే రెవిన్యూ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సాన గోవిందస్వామి,ఉపాధ్యక్షులు జి.సునీల్ కుమార్, అసైన్డ్ భూముల రక్షణ కమిటీ నాయకులు ఆంజనేయులు.వెంకట కృష్ణగ్రామ ప్రజలు పాల్గొన్నారు.మొదటిరోజుదీక్షల్లో కత్తి రవణమ్మ, వెంకట లక్ష్మమ్మ,కొండమ్మ, అనసూయమ్మ, వెంకటలక్షుమ్మ కూర్చున్నారు.

# బాపట్ల జిల్లాలో ఘనంగా సైనికుడు ఆట్ల గోపయ్య అంత్యక్రియలు

- కలెక్టర్, అధికారుల చొరవ అభినందనీయం: తాండ్ర సాంబశివరావు



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝాన్సీలో హావల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ అనారోగ్యంతో స్వర్గస్తులైన బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం అల్లుమర్లవారిపాలెం గ్రామానికి చెందిన సైనికుడు ఆట్ల గోపయ్య (గోపి రెడ్డి) అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ సైనికుడు ఆకస్మిక మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వెంటనే తాము స్పందించి బాపట్ల జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ గుణషీల ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు మరియు రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కెప్టెన్ సత్యప్రసాద్‌లకు సమాచారం అందించినట్లు తెలిపారు.

సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి అధికారులను అప్రమత్తం చేశారని, ఆర్ డి ఓ మరియు ఎం ఆర్ ఓ స్థాయి అధికారులను అంతిమ యాత్రకు పంపడంతో పాటు, ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ లాంఛనాలతో నివాళులు అర్పించేలా చర్యలు తీసుకోవడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.

సైనికుని పార్థివ దేహం జిల్లా సరిహద్దుకు చేరుకునే సమయానికే సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కెప్టెన్ సత్యప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ గుణషీలతో కలిసి సిబ్బందిని అప్రమత్తం చేశారు. అంతిమ యాత్ర చివరి వరకు ఉండి బాధిత కుటుంబాన్ని ఓదార్చి భరోసా కల్పించడం రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ శాఖ బాధ్యతాయుత పనితీరుకు నిదర్శనమని తాండ్ర సాంబశివరావు పేర్కొన్నారు.

స్వర్గీయ సైనికుడు ఆట్ల గోపి రెడ్డి పార్థివ దేహంపై బాపట్ల ఆర్ డి ఓ హరి కుమార్,ఎ ఆర్ డీఎస్పీ కృష్ణం రాజు,సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ తరపున ఆఫీసర్ గుణ షీలా, రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, స్థానిక ఎన్ సీసీ అధికారులు పూలమాలలు ఉంచి ఘనంగా సెల్యూట్ చేసి నివాళులర్పించారు.

మొదటి నుండి అధికారులతో, కుటుంబ సభ్యులతో సమన్వయం చేస్తూ పోలీస్ లాంఛనాలతో సగౌరవంగా అంత్యక్రియలు జరిపించడంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావుకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వర్గీయ సైనికుడు ఆట్ల గోపి రెడ్డికి భార్య నాగలక్ష్మి, కుమార్తె లోక్షిక ఉన్నారు.

ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల రెవెన్యూ అధికారులు, ఆర్ ఐ శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మహమ్మద్ అయుబ్, చందోలు అసోసియేషన్ అధ్యక్షులు షేక్ దావూద్, చెరుకుపల్లి అసోసియేషన్ అధ్యక్షులు సుబ్బారావు, సీనియర్ మాజీ సైనికులు దూళ్ళ వెంకటేశ్వర్లు, రాయపూడి శ్రీనివాసరావు, బాలా వెంకట కృష్ణా రెడ్డి, ఏడుకొండలు, ఎన్ సీసీ అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

# 18న డి.ఆర్.సి సమావేశం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లా సమీక్షా కమిటీ (డి.ఆర్.సి) సమావేశం ఈ నెల 18వ తేదీన జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి మరియు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన 18వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గల ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో తీసుకోవలసిన చర్యలు, తాగు నీరు, జలవనరులు, విద్యుత్, పౌర సరఫరాలు, కొత్త పింఛన్లు తదితర అంశాలపై చర్చ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

# ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిర్మాణానికి 23న భూమిపూజ

- సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు
- వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** తుళ్లూరు మండలం అబ్బురాజుపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఈ-03 రోడ్ (సీడ్ యాక్సెస్ రోడ్), ఎన్-14 జంక్షన్ వద్ద ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నారు. సర్వే నంబర్లు 51, 52, 55లో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఆసుపత్రి నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, రహదారులు, వైద్య సేవలు, విద్యుత్, మౌలిక వసతులు తదితర ఏర్పాట్లపై మంగళవారం ఆసుపత్రి నిర్మాణ స్థలంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, రహదారి సౌకర్యాలు, అత్యవసర వైద్య సేవలు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఏపీసీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ భార్గవ తేజ, అదనపు ఎస్పీ రవికుమార్, తాడేపల్లి--మంగళగిరి మున్సిపల్ కమిషనర్ హలీం భాష, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ అధికారులు విశ్వనాథరెడ్డి, లక్ష్మీనారాయణ, ఏపీసీఆర్‌డీఏ ఎస్‌డీసీ లక్ష్మీకుమారి, తుళ్లూరు ఎస్‌డీవో మురళీకృష్ణ, తుళ్లూరు తహసీల్దార్ హరిబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



### ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో

# మట్టి గణపతి విగ్రహాల పంపిణీ..

- పర్యావరణ పరిరక్షణ దైవ సంరక్షణ ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర పిలుపు...




హైదరాబాద్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : హైదరాబాద్ మహానగరంలో కృష్ణకాంత్ పార్క్ వద్ద తెలుగు ఫోక్ ఇండస్ట్రీకి చెందిన వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల సమక్షంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా దేశంలో అనేక రాష్ట్రాలలో మట్టి గణపతి మహా గణపతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల మూలంగా చెరువులు, సరస్సులు, కుంటలు, నదులు, వాగులు, మహాసముద్రాలు, పూర్తిగా కాలుష్య భర్తమవుతున్నాయని భవిష్యత్తు తరాల మనుగడ కోసం జీవవైవిధ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు మట్టి గణపతి పూజించి మన మాతృభూమి సారవంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పటికే అత్యంత కాలుష్యవ్రతమైన నగరాలలో భారతదేశ ముందు వరుసలో నిలవడం అనేక చెరువులు, కుంటలు, సరస్సులు, మహా సముద్రాలలో ఉండే ఈకో సిస్టం బయోడైవర్సిటీలు పూర్తిగా అంతరించే దశలో ఉన్నాయి, విష రసాయనాలతో తయారుచేసిన విగ్రహాల మూలంగా అనేక నీటి నీటి జీవులు ఆహార పదార్థాలుగా స్వీకరించడం మూలంగా అవి చనిపోతా ఉన్నాయి. ముఖ్యంగా రోజురోజుకీ సముద్రాల ఉష్ణోగ్రతలు పెరగడం మూలంగా ఈరోజు సూపర్ ఎల్నోన్ వంటి వాతావరణ విపత్తులు సంభవిస్తున్నాయి.. అన్ని పండుగలు అన్ని మతాలు ప్రకృతిని కాపాడుకోవడమే ప్రస్తుతం అత్యవసరంగా మన అందరి ముందున్న ఏకైక కర్తవ్యం ఇందుకు ప్రజలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు నాయకులు, అన్ని మతాల పెద్దలు, మీడియా, ప్రతి ఒక్కరు మాతో కలిసి రావాలని ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న ఈ మహా ఉద్యమానికి ప్రతి ఒక్కరు సహకరించవలసిందిగా ప్రపంచ పర్యావరణ సంస్థ విజ్ఞప్తి చేస్తుంది. తెలుగు ఫోక్ ఇండస్ట్రీకి చెందిన వ్యవస్థాపక అధ్యక్షుడు మున్నాభాయ్, వాళ్ళ బృందం వాళ్ళ కార్యవర్గ సభ్యులు ఆరు రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కళాకారులు పాల్గొని ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న ఈ మహా ఉద్యమంలో మేమందరం భాగస్వాములు అవుతామని మట్టి గణపతి పూజిస్తాం పర్యావరణాన్ని కాపాడుతామని మట్టి గణపతి ప్రమాణం చేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ముఖ్య సలహాదారులు హైదరాబాద్ ఆర్డీవో కే. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి, కోనేటి కోశాధికారి రిజ్వాన్, జాతీయ కార్యదర్శి సిహెచ్ సాగర్ నేత, స్పోర్ట్స్ విభాగం



అధ్యక్షులు అహ్మద్, సి ఎస్ ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరీష్, స్కూల్స్ ప్రోగ్రాం నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ. జోష్నారావు, సంస్థ సీనియర్ ఉపాధ్యక్షులు పవన్ కుమార్ వడ్లకొండ, ఎన్ సంతోష్ కుమార్, గడిపోయిన ఉపేందర్ యాదవ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ భారత్, కూరపాటి మనోజ్ నేత, ఎల్ అజయ్ రెడ్డి, సహాయ కార్యదర్శి మిట్టపల్లి రామకృష్ణ రవీందర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా తమ సంస్థ ఆధ్వర్యంలో 20 కేంద్రాలలో పదివేల విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.



### సాగర్ ఆయకట్టు కింద

## నీటి విడుదల చేయాలి..



హైదరాబాద్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : నాగార్జున సాగర్ ఆయకట్టు కింద వెంటనే నీటి విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకుగాను నీటి విడుదల షెడ్యూల్ ను ప్రకటించాలని కోరారు. నల్గగొండలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

సాగర్ ఎడమ కాల్వకు షెడ్యూల్ ప్రకటించకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేస్తారని స్పష్టం చేశారు. రైతులు సాగర్ అయకట్టు కింద పూర్తి స్థాయిలో మొత్తం నాట్లు వేయాలని, నీళ్ల కోసం తామంతా పోరాటాలు చేస్తామని వెల్లడించారు. మొత్తం ఆయకట్టుకు ప్రభుత్వం నీళ్లు ఇవ్వాల్సిందేనని అన్నారు. నీళ్లు ఇవ్వకపోతే ప్రభుత్వ అంతు చూస్తామని హెచ్చరించారు. రైతులు బాధలు పడుతుంటే ముఖ్యమంత్రి పైశాచికనందం పొందుతున్నారని విమర్శించారు. మంత్రులకు సోయి లేదని, ఇకపై బడిత పూజ చేయాల్సిందేనని అన్నారు. ఆంధ్ర నీటి దోపిడీపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబీకి లేఖ కూడా రాయలేదన్నారు. భూ భారతి పేరుతో భూములను కొల్లగొడుతున్నారని, ముఖ్యమంత్రి మంత్రులు అందరూ దోచుకునే పనిలోనే ఉన్నారని ఆరోపించారు. కోటికి పైగా ఎకరాలను బ్లాక్ లో పెట్టి 22ఏ పేరుతో భయబ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు ఇప్పటివరకు 200 టీఎంసీలను దోచుకుని పోయాడని ఆరోపించారు.

### రైతులకు కరెంట్, సాగునీరు ఇవ్వని దద్దమ్మ ప్రభుత్వం

: మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



హైదరాబాద్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప, చేతల ప్రభుత్వం కాదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు.. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరో పించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోవడం వంటి పాత కాంగ్రెస్ రోజుల నాటి దుస్థితి మళ్లీ పునరావృతమైందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతులు దర్జాగా పొలాల్లో పనిచేసుకునే వారని, కానీ నేడు యూరియా బస్తాల కోసం యాప్‌ల పేరుతో రైతులను క్యూ లైన్లలో నిలబెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ సస్యశ్యామలంగా మారిందని, రైతులకు నిజమైన భరోసా దక్కిందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు యాసా రామారావు, ఆర్జెసీ కృష్ణ,గుత్తా రవి,మాధంశెట్టి హరిప్రసాద్, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, పిన్ని కోటేశ్వర రావు, చెరుకూరి ప్రదీప్,దొంతు సత్యనారాయణ, హనుమంత్ రావు, ఎల్లబాబు,గోవర్ధన్, రవి,వినోద్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెంచాలి

- చేవెళ్ళ ఆర్డీఓ పార్థసింహా రెడ్డి..

షాబాద్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : షాబాద్ మండలం నాగర్ గూడను ఆర్డీఓ పార్థసింహారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెంచి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆర్డీఓ పార్థసింహారెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఐఆర్‌లో భాగంగా నాగర్‌గూడను సందర్శించిన ఆయన, ప్రక్రియ అమలు తీరును పరిశీలించారు.ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సవరణలను పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. నాగర్ గూడ కు ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. ఆర్డీఓ సానుకూలంగా స్పందించి పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్, ఉపసర్పంచ్ గుర్రం వేణుగోపాల్,మాజీ ఉపసర్పంచ్ ఆబేద్,వార్డు సభ్యులు



మహిపాల్, అఫ్సర్, గ్రామస్తులు గోపాల్ రెడ్డి, జంగయ్య, యాదయ్య, తిర్మలయ్య, పరమేష్, లింగయ్య, అధికారులు పాండు, పంచాయతీ కార్యదర్శి దయాకర్ రెడ్డి, బిఎల్ఓ సూపర్వైజర్ పద్మ, బిఎల్ఓ అంజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డీఎస్సీపై బురద చల్లొద్దు.. ఆధారాలుంటే చూపండి

- డీఎస్సీపై గొడ్డలి పార్టీది దుష్ప్రచారం అన్న పల్లా శ్రీనివాసరావు
- ఆధారాలుంటే ఆరోపణలు నిరూపించాలని సవాల్
- ప్రజల దృష్టి మళ్లించడానికే జగన్ ఆరోపణలని విమర్శ
- చంద్రబాబు, లోకేశ్ చొరవతో యువతకు ఉద్యోగ భరోసా



అమరావతి సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని, ఎంపికైన అభ్యర్థులే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమని ఆయన అన్నారు. డీఎస్సీ నియామకాలపై బురదజల్లడం ద్వారా మాజీ ముఖ్యమంత్రి జగన్ తన దిగజారుడు రాజకీయాలను బయటపెట్టుకుంటున్నారని ఆయన విమర్శించారు. విశాఖపట్నంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన ఒక అభ్యర్థిని స్వయంగా కలిసి, ఎంపిక ప్రక్రియ ఎలా జరిగిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాతపరీక్ష నుంచి కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వరకు ప్రతి దశలోనూ ప్రభుత్వం పారదర్శకత పాటించిందని, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది ఎదురవలేదని ఆ అభ్యర్థి తనకు వివరించినట్లు పల్లా తెలిపారు. అభ్యర్థులే వాస్తవాలు చెబుతున్నా, గొడ్డలి పార్టీ నేతలు అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

**వంద శాతం పారదర్శకంగా నియామకాలు :** కూటమి ప్రభుత్వం 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను వంద శాతం పారదర్శకంగా, కేవలం మెరిట్ ప్రాతిపదికనే చేపట్టిందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. క్రీడా కోటాలో సైతం అభ్యర్థుల అర్హతలను, వారు సమర్పించిన ధ్రువపత్రాలను నిపుణులతో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఈ ప్రక్రియలో ఎక్కడైనా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న వారు, అందుకు సంబంధించిన ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

**దొంగే దొంగ అన్నట్లు వైసీపీ తీరు :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసి, ఏపీపీఎస్సీలో అక్రమాలకు పాల్పడిన వారు ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని పల్లా ఎద్దేవా చేశారు. ‹వైసీపీ పాలనలో జరిగిన అవకతవకలు ఒక్కొక్కటిగా బయటకు వస్తాయనే భయంతోనే జగన్ రెడ్డి, ప్రజల దృష్టిని మళ్లించడానికి డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వారి తీరు దొంగే దొంగ అని అరిచినట్లుగా ఉంది› అని పల్లా విమర్శించారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి కష్టపడి చదివి సాధించుకున్న ఉద్యోగాలను రాజకీయ వివాదాల్లోకి లాగడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని పల్లా తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో నియామక ప్రక్రియలు వేగవంతమయ్యాయని, అర్హులైన యువతకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. యువత భవిష్యత్తుతో ఆడుకునే రాజకీయాలు మానుకోవాలని జగన్ రెడ్డికి హితవు పలికారు. గొడ్డలి పార్టీ ఎన్ని కుట్రలు పన్నినా, వాస్తవాలను దాచలేరని, వారి దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

### హెచ్‌హెచ్ ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్ 5

## పర్యటన నేపథ్యంలో బందోబస్తు..

- ఏర్పాట్లపై పోలీసులకు ఫ్యూచర్ సిటీ కమిషనర్ డా.తరుణ్ జోషి, ఐపీఎస్ దిశానిర్దేశం..
- సెప్టెంబర్ 15న ఇస్మాయిలీ కమ్యూనిటీ ఆధ్యాత్మిక కార్యక్రమం..



హైదరాబాద్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : సెప్టెంబర్ 15న హెచ్‌హెచ్ ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్ 5 పర్యటన సందర్భంగా చేపట్టనున్న బందోబస్తు ఏర్పాట్లపై ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ ఆదివారం పోలీసు అధికారులు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, రూట్ బందోబస్తు, పార్కింగ్, భద్రత, శాంతి భద్రతల ఏర్పాట్లను సమీక్షించిన కమిషనర్, ప్రతి అధికారి తనకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ముఖ్యమైన జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షించి, రూట్ బందోబస్తు సమయంలో ఎటువంటి రద్దీ తలెత్తకుండా చూడాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను క్రమబద్ధంగా నిలిపి, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు సజావుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమయపాలన, చక్కటి టర్నౌట్, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసిన కమిషనర్, విధుల్లో నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. భద్రతా నిబంధనల్లో భాగంగా కార్యక్రమ ప్రాంగణంలో ఎస్ఐ స్థాయి, అంతకంటే పైస్థాయి అధికారులకు మాత్రమే మొబైల్ ఫోన్లు అనుమతిస్తామని, కానిస్టేబుళ్లు తమ ఫోన్లను సూచించిన ప్రదేశంలో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. ఈ బ్రీఫింగ్‌లో ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ, ఐపీఎస్, షాద్‌నగర్ జోన్ డీసీపీ చ.సిరిష, ట్రాఫిక్ ఏసీపీ ఎ.చంద్రశేఖర్, ఎస్‌బీ ఏసీపీ ఎం.హుస్సైనీ నాయుడు, హెడ్‌క్వార్టర్స్ ఏసీపీ అరుణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్..

- 292 మందిపై కేసులు నమోదు..



హైదరాబాద్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ఏడీసీపీ అడ్మిన్, జీ.మరేందర్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 292 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.240 ద్విచక్ర వాహనదారులు,12 ఆటోలు, 40 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే.. 248 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, - 30 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, - 14 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (07.09.2026 ొశీ 12.09.2026) లో 681 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.18 మందికి జరిమానా, జైలు శిక్ష, 07 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,656 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

### బీజేపీ నాయకుడు సంకినేని వెంకటేశ్వరరావుకి పరామర్శ..



ఆత్మకూర్ ఎస్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : బీజేపీ జిల్లా నాయకుడు పందిరి రాంరెడ్డిని ఆదివారం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఇటీవలే రామ్ రెడ్డికి గాలిబ్లాడర్ లో రాళ్లు రావడంతో ఆపరేషన్ చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చారు ఈ విషయం తెలుసుకున్న సంకినేని మండల కేంద్రంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు సంద్యాల సైదులు, నాయకులు అబిద్ అలీ, సాయి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక పరిస్థితులతో మహిళా మృతి..



కొడిపల్లి సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : కౌడిపల్లి మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పట్నం మొగులయ్య తండ్రి మల్లయ్య నివాసులైన మో గ్గులయ్య కుమార్తె మమత ను కౌడిపల్లి మండలామ్ తునికి గ్రామానికి చెందిన నర్సినిపల్లి నరసింహులుకు వివాహం జరగగా వీరికి ఇద్దరు పిల్లలతో జీవనం కొనసాగిస్తుండగా మమతకు అనారోగ్య పరిస్థితులు మెరుగు కావడంతో ఆర్థిక ఇబ్బందులతో ఉంటూ మనోవేదనకు గురై తేదీ 6-9-2026 సాయంత్రం ఏడు గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో పొలానికి వాడే పురుగుల మందును త్రాగడంతో సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు దగ్గర్లోని నరసాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో సూరారంలోని నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్కడినుండి గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మమత ప్రాణాలు కోల్పోవడం జరిగింది కుటుంబీకుల సమాచారం మేరకు కౌడిపల్లి ఎస్సై అమరేందర్ కేసు దర్యాప్తు చేయడం జరిగింది.

### ఏపీ టెట్-2026 జూన్ ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) జూన్ 2026 ఫలితాలు విడుదల
- అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్ నంబర్ ద్వారా ఫలితాలను తెలుసుకునే అవకాశం
- ఉత్తీర్ణులైన వారికి శుభాకాంక్షలు, అర్హత సాధించని వారికి ధైర్యం చెప్పిన లోకేశ్



అమరావతి సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. ఏపీ టెట్-2026 జూన్ కు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం విడుదల చేశారు. ఈ పరీక్షలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు 51 శాతం ఉత్తీర్ణత సాధించగా, సాధారణ అభ్యర్థులు 47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ, ముఖ్యంగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు తమ అకడమిక్ నైపుణ్యాన్ని, నిబద్ధతను మరోసారి నిరూపించుకున్నారు. మీ కృషి, అంకితభావం ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి‹ అని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో, ఈసారి అర్హత సాధించలేకపోయిన అభ్యర్థులు నిరాశ చెందవద్దని లోకేశ్ భరోసా ఇచ్చారు. విజయం అనేది ఒక గమ్యం కాదు, అదొక ప్రయాణం. కాబట్టి పట్టుదలతో ప్రయత్ని స్తూనే ఉండండం అని వారికి ధైర్యం చెప్పారు. లక్ష్యసాధన కోసం కృషి కొనసాగించాలని సూచించారు. టెట్ ఫలితాలను అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ aptet.apcfss.in ద్వారా తెలుసుకోవచ్చు. దీంతో పాటు, అభ్యర్థుల సౌలభ్యం కోసం 9552300009 అనే వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫలితాలను పొందే సదుపాయాన్ని కల్పించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసి ఫలితాలను సులభంగా చూసుకోవచ్చు. ఉపాధ్యాయ నియామకాలకు టెట్ అర్హత తప్పనిసరి కావడంతో ఈ ఫలితాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది.

# పేదోడి కళ్లలో వెలుగులే లక్ష్యం..

- కడ్తాల్‌లో కొనసాగుతున్న సుంకిరెడ్డి మెగా ఉచిత కంటి వైద్య శిబిరం..
- మూడో రోజు 850 మందికి పైగా హాజరు.. 550 మందికి కంటి పరీక్షలు
- 320 మందికి ఉచిత కంటి అద్దాలు.. 28 మందికి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక
- వినాయక చవితి రోజూ కొనసాగనున్న ఉచిత వైద్య సేవలు..

**కడ్తాల్ సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పేద,మధ్యతరగతి ప్రజలకు అండగా నిలుస్తూ కడ్తాల్‌లో నిర్వహిస్తున్న సుంకిరెడ్డి 6వ మెగా ఉచిత కంటి వైద్య శిబిరం మూడో రోజు కూడా విశేష స్పందనతో కొనసాగింది.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,టాస్క్--సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో కడ్తాల్ మండల కేంద్రంలోని ఎం.బి.ఏ.గార్డెన్స్‌లో శంకర నేత్రాలయ,చెన్నై కంటి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు.మూడో రోజు శిబిరాన్ని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి వారి



కంటి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వైద్య నిపుణులతో చర్చించి కంటి పరీక్షలు,ఉచిత అద్దాల పంపిణీ,శుక్లాల ఆపరేషన్లకు ఎంపికైన రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**మూడో రోజు భారీ స్పందన :** మూడో రోజు శిబిరాన్ని 850 మందికి పైగా ప్రజలు సందర్శించగా,550 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.కంటి చూపు సమస్యలు ఉన్న 320 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు అందించారు.కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న 28 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు.ఇప్పటివరకు మూడు రోజుల వ్యవధిలో 2,200 మందికి పైగా శిబిరాన్ని సందర్శించగా,1,420 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.790 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేయడంతో పాటు,86 మంది కంటి శుక్లాల బాధితులను ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.ఎంపికైన వారికి సెప్టెంబర్ 15 నుంచి ఐదు రోజుల పాటు విడతల వారీగా ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు :** ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కంటి చూపు విషయంలో చిన్న సమస్యను కూడా నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమన్నారు.ముఖ్యంగా వృద్ధులు,మహిళలు,రోజువారీ కూలీలు,ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కంటి పరీక్షల ద్వారా చూపు లోపాలు,కంటి శుక్లాల వంటి సమస్యలను ముందుగానే గుర్తించి సరైన వైద్య సలహా పొందే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ కంటి వైద్యానికి దూరం కాకూడదనే సంకల్పంతో ఉచిత కంటి పరీక్షలు,అద్దాల పంపిణీ,అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు అందిస్తున్నామని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలు కంటి వైద్యం కోసం నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి ప్రాంతంలోనే నాణ్యమైన కంటి వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఆయన తెలిపారు.



**వినాయక చవితి రోజూ వైద్య సేవలు :** రేపు వినాయక చవితి పండుగ సందర్భంగా కూడా శిబిరానికి ఎలాంటి సెలవు ఉండదని నిర్వాహకులు తెలిపారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి వైద్య సేవలు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు. పండుగ రోజు అయినప్పటికీ కంటి సమస్యలు ఉన్న వారు శిబిరానికి వచ్చి ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందాలని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కోరారు."పేదోడి కళ్లలో వెలుగులు నింపడమే మా సేవా సంకల్పం. ప్రజల అవసరాలను గుర్తించి,వారికి నిజంగా ఉపయోగపడే సేవా కార్యక్రమాలకు భవిష్యత్తులోనూ మరింత ప్రాధాన్యత ఇస్తాం" అని ఆయన అన్నారు.

**సెప్టెంబర్ 16 వరకు పరీక్షలు.. 19 వరకు ఆపరేషన్లు :** సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు ఉచిత కంటి పరీక్షలు కొనసాగనున్నాయి.కంటి శుక్లాల సమస్యతో గుర్తించిన అవసరమైన వారికి సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు ఉచిత ఆపరేషన్లు నిర్వహించనున్నారు.కడ్తాల్ మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తల్లోజు రఘు, ఎగిరిశెట్టి లింగం,రచ్చ శ్రీరాములు, రమేష్ యాదవ్, శ్రీపతి, శేఖర్, రఫీ, శ్రీను పాల్గొన్నారు.

# భూములు ఇవ్వమన్నందుకు అర్ధరాత్రి అరెస్టులు..

- కాంగ్రెస్ ప్రభుత్వంపై మహిళ రైతుల ఆగ్రహం..
- లైట్లు ఆపేసి మహిళా రైతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రైతులకు అండగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్..

**వికారాబాద్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాడ్లాపూర్, రాపోల్ ప్రాంతాల్లో సుమారు 1,200 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక పార్కును వ్యతిరేకిస్తూ రైతులు, మహిళా రైతులు భూములు కోల్పోతున్న రైతులకు సొంత గ్రామస్తుల సహాయంతో గ్రామస్థులు కలిసి శనివారం పరిగి లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాని వ్యతిరేకిస్తూ ధర్నా చేశారు. తమ వ్యవసాయ భూములను పారిశ్రామిక పార్కు కోసం ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. గతంలో ఇదే అంశంపై ఆందోళన చేసిన సమయంలో స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే, రామ్మోహన్ రెడ్డి ప్రభుత్వ అధికారులు భూములు తీసుకోబోమని హామీ ఇచ్చారని, ప్రస్తుతం అందుకు భిన్నంగా



వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రైతులు భూములు ఇచ్చారని, పారిశ్రామిక పార్కు పనులు ప్రారంభించాలని చెప్పినట్లు పేర్కొన్నారు, రైతులు భూములు ఇవ్వలేదని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పరిగి బస్టాండ్ వద్ద రైతులు శనివారం ధర్నాకు దిగారు, అర్ధరాత్రి సమయంలో పోలీసులు మహిళా రైతులను కూడా అదుపులోకి తీసుకున్నారని గ్రామస్థులు ఆరోపించారు. రాత్రి సుమారు 1:24 గంటల సమయంలో మహిళలు ఉన్న ప్రాంతంలో విద్యుత్ దీపాలు




నిలిపివేసి పోలీసు బలగాలతో వచ్చి రైతులను అరెస్టు చేయడం దారుణమని గ్రామస్తులు అధికారుల తీరుపై మండిపడ్డారు. మహిళలు అని కూడా చూడకుండా అర్ధరాత్రి అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. భూములు కోల్పోతున్న రైతులు చేస్తూ ఉంటే అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే రైతులను పరామర్శించేందుకు వెళ్లారు. అనంతరం వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, పోలీసులు అదుపులోకి తీసుకున్న రైతులను ఎక్కడికి తరలించారో కుటుంబ సభ్యులకు కూడా స్పష్టమైన సమాచారం లేకుండా పోయిందని ఆరోపించారు. పోలీసుల నిర్బంధంలో ఉన్న రైతులకు కనీసం తాగునీరు కూడా అందడం లేదని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రైతులు భూములు ఇచ్చారని చెప్పడం వాస్తవానికి విరుద్ధమని, భూములు ఇవ్వని రైతులు ఇచ్చారని చెప్పడం సిగ్గుచేటని డాక్టర్ ఆనంద్ తీవ్రంగా విమర్శించారు. రైతులు తమ భూముల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేస్తే అర్ధరాత్రి అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. జిల్లాకు ముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్ వంటి కీలక నాయకత్వం ఉన్నప్పటికీ రైతుల సమస్యను పరిష్కరించకుండా పోలీసు బలగాలతో అణచివేయడం సరికాదన్నారు. పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు అనువైన ప్రత్యామ్నాయ భూములు ఉన్నప్పుడు రైతుల వ్యవసాయ భూములపైనే ఎందుకు ప్రభుత్వం పట్టుబడుతోందని ప్రశ్నించారు. రైతుల కుటుంబాలు, జీవనాధారాన్ని దెబ్బతీసేలా బలవంతపు భూసేకరణకు ప్రయత్నిస్తే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పరిగి మండల్ కాడ్లాపూర్ రైతులు చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని డాక్టర్ మెతుకు ఆనంద్ స్పష్టం చేశారు.

# దళితుల జోలికొస్తే ఖబర్దార్..!



- బోడుప్పల్లో 395వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు జ్ఞానమాల..
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలపై నిరసన..
- 80 ఏళ్ల స్వాతంత్ర భారతంలో దళితుల స్థానం ఎక్కడ?
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న మందుల సూర్య కిరణ్, బొమ్మక్ కళ్యాణ్ కుమార్, పోగుల దిలీప్ రెడ్డి.

**మేడిపల్లి సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 395వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిపిసిసి ఎస్ సి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందుల సూర్య కిరణ్, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అదేవిధంగ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ బి ఆర్ ఎస్ నేతలు అధికారం కోల్పోయిన అహంకారం ఇంకా తగ్గలేదని, ఇంకా దొరల పెత్తనం చెల్లాయించాలని చూడడం సిగ్గుచేటని మండిపడ్డారు. అత్యున్నత స్థానంలో ఉన్న స్పీకర్ ఒక దళితుడైనందువల్లే అలాంటి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఇది యావత్ తెలంగాణ దళితులకు వర్తిస్తుందని దళితులతో పెట్టుకుంటే, కొరివితో తల గోక్కున్నట్లే నని, బేషరతుగా తాత మధు దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 80 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో ఇంకా దళితులు అనగదొక్కబడుతూ, అవమానించబడుతున్నారని, భారత రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక దళితుడు అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం బోడుప్పల్ అధ్యక్షుడు గరుగుల యాకయ్య, రొయ్య లక్ష్మీనారాయణ రాపోలు వెంకటేష్, యేసు రాజు, గుంజి శ్రీనివాస్, చిల్ల అంజయ్య, సగ్గ నరసింహ, రామకృష్ణ ఇంకా అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

## రామాసిపల్లి మైసమ్మ బోనాల్లో సుంకి రెడ్డి..

- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు..
- గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు

**తలకొండపల్లి సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో రామాసిపల్లి మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు



చెల్లించుకున్నారు. ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో సందడిగా సాగాయి. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.రామాసిపల్లి మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో ఐక్యత,సోదరభావం పెంపొందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మైసమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న గ్రామ ప్రజలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### దళితులను అవమానించిన బీఆర్ఎస్ తీరుపై

## దళిత సంఘాల ధర్నా..

- నిరసనలో పాల్గొన్న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం..

**నల్గొండ సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని, అలాగే కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు నిరసన వ్యక్తం చేసిన సమయంలో పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. దళిత సమాజాన్ని అవమానించేలా వ్యవహరించడం, అత్యున్నత పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత పదజాలంతో మాట్లాడటం, దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం వంటి చర్యలు అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను తెలంగాణ సమాజం ఎన్నటికీ సహించదని స్పష్టం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం నిలబడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు వెంటనే దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, భవిష్యత్‌లో ఇలాంటి అవమానకరమైన చర్యలకు పాల్పడకుండా బాధ్యతాయు తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం డిమాండ్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత..

- గుర్రం పవన్ కుమార్..
- మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి..



**సికింద్రాబాద్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,అందులో భాగంగా ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పద్మారావునగర్ డివిజన్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ సూచించారు.ఆదివారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు నిర్వహించడంతో పాటు పర్యావరణ హితమైన పద్ధతులను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారి నారాయణ, బీఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ ఏసూరి మహేష్, వెంకటేషన్ రాజు, బాల్‌రెడ్డి, కౌసల్య, అమృత, అంబిక, ముక్క శ్రీనివాస్, జగ్గయ్య, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా మిత్రులు...



**కీసర, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం అహ్మద్‌గూడకు చెందిన పల్లె ఆనంద్‌గౌడ్ గత నెల ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన చిన్ననాటి మిత్రులు మానవత్వంతో స్పందించారు. జిల్లా పరిషత్ చీర్యాలలో 1995-96 బ్యాచ్‌లో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయంగా రూ.63 వేల ఆర్థిక సాయాన్ని ఆనంద్‌గౌడ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్‌లోనూ కుటుంబానికి తమవంతు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజ నరసింహ గౌడ్, బాల్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, శ్రీశైలం, రాజేష్, కరుణాకర్‌గౌడ్, బుచ్చిరెడ్డి, కృష్ణగౌడ్, మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీజేఆర్ నగర్ గౌడ సంఘానికి నూతన కమిటీ

- అధ్యక్షుడిగా దుబ్బాక రవీందర్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక



**జవహర్‌నగర్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేఆర్ నగర్‌తో పాటు పరిసర కాలనీలకు చెందిన గౌడ కులస్తులు సమావేశమై గౌడ సంఘానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలనే ఉద్దేశంతో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా దుబ్బాక రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా మెరుగు బిక్షపతి, తండా ప్రభాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండకింద భరత్ గౌడ్, కోశాధికారిగా దంతూరి శివకుమార్ గౌడ్, సహాయ కార్యదర్శిగా దుబ్బాక నవీన్ గౌడ్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా వడ్లకొండ వెంకటేశ్వర్లు, మొక్తల శంకరయ్య గౌడ్, పుట్ట బిక్షపతి గౌడ్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బి.ఈశ్వర్ గౌడ్, బి.కృష్ణ గౌడ్, ఎన్.వెంకన్న గౌడ్, దంతూరి రజినీకుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దుబ్బాక రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘంలోని ప్రతి సభ్యుడి అభిప్రాయాలను గౌరవిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని అన్నారు. గౌడ సంఘం ఐక్యతను మరింత బలోపేతం చేసి, సభ్యుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సంఘ సభ్యుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. నూతన కమిటీ ఎన్నికతో సంఘంలో నూతన ఉత్సాహం నెలకొంది.

### భక్తితో గణపయ్యను కొలుద్దాం..

## ప్రకృతిని కాపాడుదాం..

- మట్టి వినాయకుల ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే కసిరెడ్డి పిలుపు



**కడ్తాల్ సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** వినాయక నవరాత్రుల వేళ భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రసాయన రంగులతో తయారైన వినాయక విగ్రహాల వల్ల జలాశయాలు,నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజించాలని కోరారు.ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహతో కలిసి టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పర్యావరణ హితమైన మట్టి వినాయక ప్రతిమను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి-మాధవి దంపతులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.వినాయక ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య, భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలని సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు వినాయక నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఫరీద్, నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, రఘురాములు, డేవిడ్, నరసింహారెడ్డి, రాజేందర్, రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కురవి మండలం సూధనపల్లి పాఠశాలలో మట్టి వినాయకుల (ఎకో ఫ్రెండ్లీగణపతి )తయారీ

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దు
- మట్టి వినాయకులే ముద్దు అని పిలుపు
- ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు చిన్నం ప్రదీప్ కుమార్



**మహబూబాబాద్ , (జర్నలిస్ట్ ఫైల్) :** కురవి మండలం లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సూధనపల్లి లో విద్యార్థులందరూ మట్టి వినాయకులను( ఎకో ఫ్రెండ్లీ గణపతి) తయారు చేయడం జరిగింది .ఈ కార్యక్రమానికి ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మరియు స్కూల్ అసిస్టెంట్ శ్రీ చిన్నం ప్రదీప్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రజలందరూ మట్టి వినాయకుడిని పూజించాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారైన వినాయకుల వాళ్ళ నీటి కాలుష్యం పెరుగుతుందని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎండి .అంజద్ పాషా, గాండ్ల బాలరాజు, బి. సరోజ, వి.శుభ, కె. సారంగం, ఏ .ప్రగతి,ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ రేఖ మాధవి, ఆయా నీలం వాసవి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎలమశెట్టి ధనమ్మ , అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

- షాబాద్‌లో హోప్ ఫాండేషన్ ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ



**షాబాద్, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** షాబాద్ పట్టణంలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు.ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, మట్టి విగ్రహాలతో పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించవచ్చని తెలిపారు.ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే తమ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మట్టి వినాయకుడి ప్రతిమలను ఉపయోగించాలని వారు కోరారు కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు మల్లికార్జున్,కొండ ప్రదీప్, శ్రీనివాస్, అశోక్, బస్వరాజ్, రాఘవేందర్, సత్యేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగ ఉద్యోగుల హక్కులను కాపాడాలి



**శామీర్‌పేట, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** వికలాంగ ఉద్యోగులకు చట్టబద్ధంగా కల్పించాల్సిన హక్కులు, సౌకర్యాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయాలని విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు.2016 వికలాంగుల హక్కుల చట్టం, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖల్లో అంధులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. అలాగే శాఖాపరమైన పరీక్షల నుంచి, ఎన్నికల విధుల నుంచి, ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నుంచి మినహాయింపు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వికలాంగ ఉద్యోగుల సామర్థ్యాలను గుర్తించి వారికి అనుకూలమైన పని వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సమావేశంలో పేర్కొన్నారు.మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం.డి. షరీఫ్, అసోసియేట్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బి. మురళి, వై. కోటేశ్వరి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కె. సందీప్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి. బస్వరాజు, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీశైలం, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నందన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ పోరాటాన్ని మతపోరాటంగా వక్రీకరించొద్దు



**మల్కాజిగిరి, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముస్లింలపై హిందువులు జరిపిన పోరాటంగా చిత్రీకరించడం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమేనని సీపీఎం నాయకుడు కోమటి రవి అన్నారు. బీజేపీ చేస్తున్న ఈ వక్రీకరణను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాలు, సీపీఎం మల్కాజిగిరి మండల దివంగత నాయకుల సంస్మరణ సభను ఆదివారం మల్కాజిగిరి గాంధీ పార్కులో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.సభకు మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన కోమటి రవి మాట్లాడుతూ.. 1948 నుంచి 1953 వరకు ఐదేళ్లపాటు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన ప్రజా పోరాటమని తెలిపారు. భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గ్రామగ్రామాన ప్రజలు సంఘటితమై ఉద్యమించారని పేర్కొన్నారు.భూస్వాములు, జాగీర్దారులు నిజాం పాలనకు అనుకూలంగా వ్యవహరిస్తూ రైతులపై పన్నులు, శిస్తులు విధించారని, పంటలను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. మహిళలపై తీవ్ర అణచివేత, అత్యాచారాలు జరిగాయని, కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలపై కూడా తీవ్ర నిర్బంధం కొనసాగిందన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలు సంఘటితమై సాయుధ పోరాటం సాగించారని చెప్పారు.పోరాట కాలంలో భూస్వాముల ఆధీనంలోని సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, మూడు వేల గ్రామాలు విముక్తి పొందాయని తెలిపారు. నాలుగు వేల మంది పోరాట యోధులు ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. రజాకార్ల కాల్పుల్లో తొలుత అమరుడైన దొడ్డి కొమరయ్యను స్మరించుకున్నారు. సుందరయ్య, రావి నారాయణరెడ్డి, చండ్ర రాజేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, మగ్దూం మొహియుద్దీన్ తదితరులు పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు.అనంతరం సీనియర్ నాయకుడు కృపాసాగర్ మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రాంతంలో పార్టీ, ప్రజా ఉద్యమానికి సేవలందించిన దివంగత నాయకులు చిందం నర్సింహ, పిల్లి నర్సింగరావు, బిక్షపతి, విజయభాస్కర్, వెంకట్, వెంకటేశ్వర్లు, స్వామిగౌడ్, ముత్యాలు, ఏరాజమల్లయ్య, మల్లయ్య, నాగమణ్యం, రఘుపాల్, భుజంగరావు, గాంధీనగర్ బిక్షపతి, పీసీ పిళ్లై సేవలను కొనియాడారు. వారి కుటుంబ సభ్యులను సన్మానించారు.మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను సీపీఎం నాయకురాలు లీల ఖండించారు. అనంతరం వెంకట్‌రెడ్డి, హరి, శీను, విజయకుమార్, శ్రీనివాస్, కొండల్, సీనియర్ నాయకుడు నర్సయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో సూర్యకుమార్, వైష్ణవి, పద్మ, సరోజ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం:బిమిడి జైపాల్ రెడ్డి



**శామీర్‌పేట, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు నీటి వనరుల పరిరక్షణకు తోడ్పడవచ్చని తెలిపారు.వినాయక చవితిని పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ శ్రీ సీతారామస్వామి దేవస్థానం వద్ద మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి తదితరులు భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులు కలుషితం కాకుండా ఉంటాయని వారు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారయ్యే విగ్రహాల వల్ల నిమజ్జనం సమయంలో నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి, పరిశుభ్రమైన నీటి వనరులను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్లు దాసరి గోపాల్‌రెడ్డి, పేండం లక్ష్మి నారాయణ, బీజేపీ నాయకులు పట్నం నర్సింహారెడ్డి, దుర్గం ప్రకాశ్‌గౌడ్, దేవరయాంజాల్ సూపర్‌వైజర్లు ఆనంద్, రజిని తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లు కోల్పోయే ఆర్‌ఓబీ వద్దు.. ఆర్‌యూబీ ముద్దు





**మల్కాజిగిరి, సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** అభివృద్ధి పేరుతో తమ ఇళ్లు, ఆస్తులు కోల్పోయె పరిస్థితి కల్పించవద్దని మల్కాజిగిరి నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు డిమాండ్ చేశారు. ఓల్డ్ మల్కాజిగిరి నుంచి జెడ్‌టీసీ–లాల ◌ాపేట్ బ్రిడ్జికి అనుసంధానం చేసేలా ప్రతిపాదించిన ఆర్‌ఓబీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. "ఆర్‌ఓబీ వద్దు.. ఆర్‌యూబీ కావాలి" అంటూ తమ అభిప్రాయాన్ని స్పష్టం చేశారు.మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఓల్డ్ మల్కాజిగిరి, బాల సరస్వతి నగర్, లక్ష్మీ సరస్వతి నగర్, సర్దార్ పటేల్ నగర్, దుర్గా నగర్, కృష్ణ సాయి కాలనీ, హైదర్ నగర్, ఉప్పరిగూడ తదితర ప్రాంతాల ప్రజలు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. ప్రతిపాదిత ఆర్‌ఓబీ నిర్మాణంతో తమ ఇళ్లు, ఆస్తులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాభిప్రాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం స్థానికుల నిర్ణయం మేరకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు నష్టం కలిగించేలా అభివృద్ధి పనులు చేపట్టకూడదని, ప్రత్యామ్నాయాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.సుమారు 400 ఇళ్లకు ముప్పుమాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ మాట్లాడుతూ ప్రతిపాదిత ఆర్‌ఓబీ నిర్మాణంతో సరార్ పటేల్ నగర్, దురా నగర్, కృష్ణ సాయి కాలనీ, బాల సరస్వతి నగర్, లక్ష్మీ సరస్వతి నగర్, హైదర్ నగర్, ఉప్పరిగూడ, ఓల్డ్ మల్కాజిగిరి ప్రాంతాల్లో సుమారు 400 ఇళ్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందన్నారు. అనేక కుటుంబాలు తమ ఇళ్లు, ఆస్తులను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూనే ప్రజల నివాసాలకు నష్టం కలగకుండా తక్కువ ప్రభావంతో కూడిన ఆర్‌యూబీ నిర్మాణాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో బద్దం పరుశురాం రెడ్డి, చిన్న యాదవ్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణరావు, సతీష్, శ్రీకాంత్‌తో పాటు వివిధ కాలనీల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.ప్రజల ఇళ్లు, ఆస్తులు కాపాడుతూ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేలా అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని కాలనీవాసులు స్పష్టం చేశారు.

## కమిషనర్ మయూర్ అశోక్‌కు ఘనసత్కారం



○ గుంటూరు నగర కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** వాయు కాలుష్య నియంత్రణలో విశేష ప్రతిభ కనబరిచి కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన లిలి'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్––2026'లిలిలో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా ఏకకాలంలో 25 వేల మంది విద్యార్థులతో 25 వేల మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయించి గుంటూరు నగరానికి లిలి'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్'లిలిలో గుర్తింపు తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించిన నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్‌ను మంగళవారం పలువురు స్వచ్ఛంద సంస్థలు, యూనియన్ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ప్రతినిధి పి. శివప్రసాద్, మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వి. వెంకట నాగిరెడ్డి, మునిసిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ. మధుబాబు, మరాఠా రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు కమిషనర్‌ను కలిసి పర్యావరణహిత పూల మొక్కలను అందజేసి, శాలువాలు కప్పి అభినందించారు. గుంటూరు నగరాన్ని స్వచ్ఛ, సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కమిషనర్ తీసుకుంటున్న చర్యలు, చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో గుంటూరును మరిన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డు, అలాగే గ్రీన్ గణేష్ కార్యక్రమం ద్వారా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్లో గుంటూరు నగరానికి గుర్తింపు రావడంలో అధికారులు, సిబ్బంది కృషితో పాటు ప్రజాప్రతినిధుల సహకారం, ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. రానున్న రోజుల్లో నగరపాలక సంస్థ చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు మరింతగా భాగస్వాములు కావాలని కోరారు.

## ఎన్నికల నిర్వహణపై ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు సమగ్ర అవగాహన అవసరం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్‌ఓలు) తమ విధులు, ఎన్నికల నిబంధనలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ సూచించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులకు కేటాయించిన ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మాస్టర్ ట్రైనర్లు సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఆర్‌ఓల పాత్ర అత్యంత కీలకమని, తమకు కేటాయించిన వార్డుల్లో ఎన్నికల ప్రక్రియలో ఏవైనా తప్పులు జరిగితే ఆర్‌ఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కేటాయించిన డివిజన్లలో ఓటర్ల జాబితా, ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు, పోలింగ్ కేంద్రాల పరిశీలనతో పాటు అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే పరిశీలించి నగర పాలక సంస్థ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ఓటర్ల జాబితాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్‌ఓ హ్యాండ్‌బుక్, ఎలక్షన్ గైడ్‌లైన్స్, కాండిడేట్స్ హ్యాండ్‌బుక్ తదితర మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు నగర పాలక సంస్థ అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి సహకరిస్తుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు సి. హెచ్. శ్రీనివాస్, బి. శ్రీనివాసరావు, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.

# వైసీపీని ఖాళీ చేస్తాం : ఎమ్మెల్యే నసీర్

○ తూర్పులో వైసీపీని వీడి టీడీపీలో 57 మంది చేరిక

○ ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో పసుపు కండువా కప్పుకున్న నేతలు

○ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే

○ కూటమి పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్న నేతలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** 'రెండేళ్లలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాం. అందుకే ఇతర పార్టీల నుంచి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. త్వరలోనే వైసీపీని ఖాళీ చేస్తామ'ని ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు కార్యాలయంలో 2 వార్డు నుంచి షేక్ సులేమాన్ బాషా ఆధ్వర్యంలో 25 మంది, 55 వార్డులో టీడీపీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ కాలె దేవదాస్ ఆధ్వర్యంలో 32 మంది వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో మైనార్టీలకు, స్థానిక ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని భావించి ప్రజలు వైసీపీని వీడుతున్నారని చెప్పారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నియోజకవర్గాన్ని మోడల్ గా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలలో నమ్మకం పెరిగిందన్నారు. మైనార్టీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఇప్పటికే నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పార్టీ కష్టపడి పని చేసే వారికి సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అందిస్తున్న ప్రజా సేవకు ఆకర్షితులమై తెలుగుదేశం పార్టీలో చేరామని తెలిపారు.

# వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల వినూత్న నిరసన

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన కాంట్రాక్టు ఉద్యోగుల నిరసనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. ఇందులో భాగంగా బాపట్ల జిల్లా ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ సభ్యుడు సత్యం రాజు కూరపాటి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బాపట్లజిల్లా ఏరియా వైద్యశాల ప్రాంగణంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో రశీగోళీ ముగ్గులు వేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. చేతుల్లో డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ, ముగ్గులు వేసి ప్రభుత్వానికి తమ ఆవేదనను తెలియజేశారు.

ఈ సందర్భంగా జేఏసీ సభ్యుడు సత్యం రాజు కూరపాటి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం, ప్రాణాలను కాపాడేందుకు కష్టపడుతున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం





ఇకనైనా పట్టించుకోవాలి. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని."

"కాంట్రాక్టు ఉద్యోగులకు బదిలీ సౌకర్యం కల్పించాలని,విధుల్లో ఉన్న సమయంలో ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి కనీసం ?50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని."

"ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలనే "ప్రధాన డిమాండ్లు

కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని ,కాంట్రాక్టు ఉద్యోగులకు బదిలీ సౌకర్యం కల్పించాలంటూ కోరారు.

విధుల్లో ఉండగా మరణించిన కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు ?50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి,కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని,ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలిఅని డిమాండ్ చేసారు.

కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో సేవలు అందిస్తున్నప్పటికీ తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సు తబిత, ఫార్మసిస్టులు శాంతి,,నళిని కుమారి, బయోమెడికల్ ఇంజనీర్ నళిని కుమారి, ల్యాబ్ టెక్నీషియన్లు నీలిమ, సునీత తదితర కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

# నవులూరులో ఆక్రమణదారుల అరాచకం





○ 70 ఏళ్లుగా మక్కేవారిపేట సమాధులకు వెళ్లే పాత ప్రధాన మార్గం ఆక్రమణ

○ ప్రత్యామ్నాయ రహదారి అభివృద్ధిలో భాగంగా జీఎస్‌బీ రోడ్డు నిర్మాణం

○ తొలగించేందుకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ ఉద్యోగిపై ముగ్గురి దాడి

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరులో ఆక్రమణదారుల అరాచకం రోజురోజుకూ పెరుగుతోంది. సుమారు 70 ఏళ్లుగా నవులూరు గ్రామ మక్కేవారిపేట సమాధులకు వెళ్లేందుకు వినియోగిస్తున్న పాత ప్రధాన మార్గాన్ని ఆక్రమించేశారు. ఎంటీఎంసీ కార్పొరేషన్ నిధులతో మక్కేవారిపేట సమాధుల రోడ్డు నుంచి గోలివారి తోటకు వెళ్లే ప్రత్యామ్నాయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా జీఎస్‌బీ రోడ్డు మూడు రోజుల క్రితం నిర్మించారు. అయితే, తమకు భూ పారం–పట్టా లు ఉన్నాయని పేర్కొంటూ కొందరు నడిరోడ్డును ఆక్రమించి బాదులు ఏర్పాటు చేశారు. దీనిపై ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ ఉద్యోగిపై మంగళవారం ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. దాడి ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ లో ఉద్యోగి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సమాధుల రోడ్డుకు 70 ఏళ్లగా వినియోగిస్తున్న దారికి పట్టాలు ఎలా వచ్చాయి అనే దానిపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని, దారిని ఆక్రమణదారుల చెర నుండి విడిపించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రయోగశాలను పరిశీలించిన వైద్యాధికారి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ )::** స్థానిక పినపాడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రయోగశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు, పట్టణ సబ్ యూనిట్ ఆఫీసర్ అందెబాలచంద్రమౌళి పరిశీలించారు. కీటక జనిత వ్యాధుల తీవ్రత , క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది రక్తపూతల నమూనాల సేకరణ,తదుపరి ప్రయోగశాలకు పంపించుట తదితర అంశములను క్షుణ్ణంగా పరిశీలించారు. రక్త నమునాల సేకరణ పరీక్షలకు సంబంధించి తగు సూచనలు , సలహాలను ల్యాబ్ టెక్నీషియన్ కు వైద్య అధికారులు తెలియజేశారు. తెనాలి పట్టణ సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు కీటక జనిత వ్యాధులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలని,నీటి నిల్వలు లేకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సూపర్వైజర్ దీపాల శ్రీనివాసరావు, ఫార్మసిస్ట్ సంధ్యారాణి , ల్యాబ్ టెక్నీషియన్ పత్తి సుధీర్ కుమార్ , హెల్త్ అసిస్టెంట్ సయ్యద్ కరిముల్లా, డీఈవో గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడే వైకుంటపురం దేవస్థానం కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ )::** స్థానిక వైకుంఠపురం దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం జరుగుతుందని పట్టణ టీడీపీ అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్ తెలిపారు. పట్నంలోని నియోజవర్గ టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి అధ్యక్షుడు ఖుద్దూస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైకుంఠపురం దేవస్థాన పాలకవర్గ కమిటీ నియమించడం జరిగిందని బుధవారం ఉ.గం. 9:00 ల నుండి ఐతానగర్ పేరంటాళ్లమ్మ గుడి వద్ద నుండి ర్యాలీగా గాంధీచౌక్,చిట్టి ఆంజనేయ స్వామి సెంటర్,టెలిఫోన్ ఎక్చేంజి రోడ్డు, వాహబ్ చౌక్ మీదుగా వైకుంఠపురం దేవస్థానం చేరుకుని ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ కార్యక్రమంలో కేంద్ర మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్,శాసన మండలి సభ్యులు, తెనాలి టిడిపి ఇంచార్జీ ఆలపాటి రాజేంద్రప్రసాద్,రాష్ట్ర మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్ మరికొందరు ప్రముఖులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ప్రమాణ స్వీకార మహోత్సవంనకు ప్రజలు కూడా పాల్గొని దేవస్థానం పాలన వేంకటేశ్వరుని దయతో సజావుగా జరిగగే విధంగాఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు,కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 17న జిల్లా బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లా బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశం 17వ తేదీన జరుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.జి.ప్రసూన తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో మిషన్ వాత్సల్య పథకం అమలుతో పాటు ఇతర అంశాలను సమీక్షించడం జరుగుతుందని అన్నారు. కమిటీ సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు.

## ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్ డేను ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గుంటూరులో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్ ఎం. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ సమాజ అభ్యున్నతికి ఇంజనీర్లు విశేష సేవలు అందిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. సంజయ్ మాట్లాడుతూ, సర్ ఎం. విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ, అంకితభావం, సాంకేతిక నైపుణ్యం నేటి ఇంజనీర్లకు ఆదర్శమని అన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకుని దేశ ప్రగతికి దోహదపడాలని సూచించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి ఇంజినీర్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతపై విద్యార్థులు దృష్టి సారించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు రాము, కె.ఎస్.ఆర్., నాగేశ్వరరావు, లైబ్రరీ ఇన్‌చార్జి రసూల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మరియు అధ్యాపకులకు ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

# క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

○ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

○ ప్రతి సమస్యకు కాలపరిమితి నిర్దేశించుకుని పరిష్కరించాలి

○ కలెక్టర్ సి యం.సాయి కాంత్ వర్మ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. యం.సాయి కాంత్ వర్మ స్పష్టం చేశారు.

రాష్ట్ర స్థాయిలో ఇటీవల నిర్వహించిన కలెక్టర్స్ కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలు, ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతలు, జిల్లాలో వాటి అమలుపై జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ లోని విసి హాల్లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖకు చెందిన అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సామాజికంగా ఎక్కువ ప్రభావం చూపే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సమస్యకు స్పష్టమైన కాలపరిమితిని నిర్దేశించుకుని, నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలు, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన అంశాలపై సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా దృష్టి సారించి పనిచేయాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్నారు. అలాగే జిల్లాలోని ప్రతి శాఖకు సంబంధించిన ప్రధాన పనితీరు సూచికల పురోగతి వివరాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఎప్పటికప్పుడు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు జిల్లాలో ఉన్నాయని కలెక్టర్ పేర్కొంటూ, అయితే వాటిలో క్రియాశీలంగా లేని యూనిట్లను గుర్తించి, వాటి పరిస్థితిని పరిశీలించి తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు మరింత పెరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లా అంతటా సంవత్సరం పొడవునా గ్రీన్ కవర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పచ్చదనం పెంపొందించేందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి, మొక్కల పెంపకం, సంరక్షణ, పచ్చదనం అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయాలని సూచించారు.

**ఈ-ఆఫీస్ ద్వారా ఫైళ్ల నిర్వహణ**

పరిపాలనా ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఫైళ్లు ఈ–ఆఫీస్ ద్వారానే రావాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఫైళ్ల కదలికలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిర్ణీత సమయంలోగా ఫైళ్లను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**పాఠశాలలు స్టార్ రేటింగ్స్‌లో ముందంజలో ఉండాలి**

జిల్లాలోని అన్ని పాఠశాలలు స్టార్ రేటింగ్స్‌లో ముందంజలో ఉండేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన రేటింగ్ సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణకు పటిష్ట చర్యలు**

టీనేజ్ ప్రెగ్నెన్సీని నివారించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. బాలికల ఆరోగ్యం, విద్య, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న బాలికలను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన కౌన్సెలింగ్, ఆరోగ్య సేవలు, రక్షణ, సహాయాన్ని అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులు తగ్గేలా సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు.

**అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**

జిల్లాలోని అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతను పటిష్టం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టళ్లలో మౌలిక వసతులు, పరిశుభ్రత, భోజనం, భద్రత తదితర అంశాలను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.

ఈ సమావేశం లో గుంటూరు నగర పాలక సంస్థ కమీషనర్ మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డి ఆర్ ఓ ఖాజావలి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# నేడే నేలపాడు పీఏసీఎస్ ప్రమాణ స్వీకార మహోత్సవం

○ ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):** నేలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం తెనాలి పట్టణంలోని ఐతానగర్ సాయిబాబా ఆలయం సమీపంలోని నన్నపనేని సీతారామయ్య-సరస్వతమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

నేలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా అన్నాబత్తుని శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా సహకార సంఘం అభివృద్ధి, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడం తదితర అంశాలపై నాయకులు మాట్లాడనున్నారు.

ప్రమాణ స్వీకార మహోత్సవానికి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

# సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

○ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిర్మాణానికి 23న భూమిపూజ

○ వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** తుళ్లూరు మండలం అబ్బురాజుపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఈ-03 రోడ్ (సీడ్ యాక్సెస్ రోడ్), ఎన్-14 జంక్షన్ వద్ద ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నారు. సర్వే నంబర్లు 51, 52, 55లో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఆసుపత్రి నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, రహదారులు, వైద్య సేవలు, విద్యుత్, మౌలిక వసతులు తదితర ఏర్పాట్లపై మంగళవారం ఆసుపత్రి నిర్మాణ స్థలంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, రహదారి సౌకర్యాలు, అత్యవసర వైద్య సేవలు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఏపీసీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ భార్గవ తేజ, అదనపు ఎస్పీ రవికుమార్, తాడేపల్లి--మంగళగిరి మున్సిపల్ కమిషనర్ హలీం భాష, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ అధికారులు విశ్వనాథరెడ్డి, లక్ష్మీనారాయణ, ఏపీసీఆర్‌డీఏ ఎస్‌డీసీ లక్ష్మీకుమారి, తుళ్లూరు ఎస్‌డీపీవో మురళీకృష్ణ, తుళ్లూరు తహసీల్దార్ హరిబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాల బలోపేతానికి మోదీ కృషి





○ బ్రిక్స్ వేదికగా భారత్ ప్రాధాన్యతను చాటిన మోదీ

○ భారత్ ప్రయోజనాలే లక్ష్యంగా బ్రిక్స్‌లో కీలక చర్చలు

○ బ్రిక్స్ సదస్సు విశేషాలను వివరించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):** ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో విజయవంతంగా ముగిసిన ప్రతిష్టాత్మక బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మంగళవారం విజయవాడకు చేరుకున్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించారు. వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు విశేషాలను శ్రీనివాస వర్మ పార్టీ నాయకులతో పంచుకున్నారు. ప్రపంచ వేదికపై భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతి, బ్రిక్స్ వేదికగా భారత్ ప్రస్తావించిన కీలక అంశాలు, సదస్సులో జరిగిన చర్చలను వివరించారు. ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, సాంకేతికత, పారిశ్రామిక ప్రగతి రంగాల్లో దేశ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లేందుకు మోదీ చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీతో కేంద్ర మంత్రి కొద్దిసేపు భేటీ అయ్యారు.

రాష్ట్రంలో పార్టీ సంస్థాగత కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిసింది. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ హెడ్‌క్వార్టర్స్ ఇన్‌చార్జ్ ఉప్పలపాటి శ్రీనివాస రాజు, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ కిలారి దిలీప్, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొవ్వల సుబ్బయ్య, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి పిట్టల గోవింద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్నాయక్, బీజేపీ సీనియర్ నాయకులు కంఠమనేని మురళి తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):** వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా తెనాలి పట్టణంతో పాటు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ప్రజలు భక్తిశ్రద్ధలతో పాటు సోదరభావంతో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్సీ కోరారు. తెనాలి పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు రూరల్ మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన ఉత్సవాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను పలువురు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వినాయక మండపాల వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

# గుంటూరు జీజీహెచ్‌లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై ఉచిత స్క్రీనింగ్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించేందుకు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో బుధవారం ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. ప్రతి అర్హత కలిగిన మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ నెల 16న ఉదయం 9 గంటల నుంచి జీజీహెచ్‌లోని నాట్కో భవనంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్, ఆధునిక హెచ్‌పీవీ డీఎన్ఏ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా సకాలంలో చికిత్స అందించి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మహిళలు నిర్లక్ష్యం చేయకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని, ప్రతి ఒక్కరూ తమతో పాటు మరో మహిళను కూడా తీసుకువచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ దుర్గా ప్రసాద్ కోరారు.

# బ్లాక్ ఫంగస్‌పై పోరులో విజయం.. 13 ఏళ్ల బాలికకు ప్రాణదానం

○ మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యుల సమష్టి కృషితో అరుదైన చికిత్స



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రాణాంతక బ్లాక్ ఫంగస్ వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురైన 13 ఏళ్ల బాలికకు మంగళగిరి ఎన్ఆర్ఐ సూపర్ స్పెషాలిటీ, జనరల్ ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. మధుమేహం కారణంగా శరీరంలో వ్యాధి తీవ్రరూపం దాల్చినప్పటికీ, వివిధ వైద్య విభాగాల నిపుణులు సమన్వయంతో సుమారు 45 రోజులపాటు అందించిన చికిత్సతో బాలిక పూర్తిగా కోలుకుని ఇంటికి చేరింది. సాధారణంగా రూ.20-25 లక్షల వరకు అయ్యే చికిత్సను బాలిక కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి యాజమాన్యం ఉచితంగా అందించడం విశేషం.

మంగళవారం ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి బాలికకు అందించిన చికిత్స వివరాలను వెల్లడించారు. కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన 13 ఏళ్ల కస్తూరి భాయ్ ఏడాది కాలంగా మధుమేహంతో బాధపడుతోంది. ఇటీవల రక్తంలో చక్కెర స్థాయిలు తీవ్రంగా పెరగడంతో మధుమేహ సంబంధిత ఆమ్లవిషతుల్యతకు గురై కోమాలోకి వెళ్లింది. దీంతో జూలై 13న బాలికను ఎన్ఆర్ఐ ఆసుపత్రి పిల్లల అత్యవసర చికిత్స విభాగంలో చేర్చారు. వైద్యులు తక్షణ చికిత్స అందించడంతో 24 గంటల్లో రక్తంలోని చక్కెర స్థాయులు నియంత్రణలోకి వచ్చినప్పటికీ, తీవ్రమైన కడుపునొప్పి కొనసాగింది.

పరిస్థితిని అంచనా వేసేందుకు తదుపరి పరీక్షలు నిర్వహించగా కాలేయం, జీర్ణాశయానికి మ్యూకార్ మైకోసిస్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. వేగంగా వ్యాప్తి చెందే స్వభావం కలిగిన ఈ ఇన్‌ఫెక్షన్ మరింత ప్రమాదకరంగా మారకముందే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. జీర్ణాశయ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్‌లో కాలేయంలోని దెబ్బతిన్న కొంత భాగంతో పాటు జీర్ణాశయాన్ని తొలగించారు. అనంతరం చిన్నపేగుకు ఆహారం అందేలా ప్రత్యేక నాళాన్ని ఏర్పాటు చేశారు. శస్త్రచికిత్స అనంతరం పిల్లల అత్యవసర చికిత్స విభాగంలో నిరంతర పర్యవేక్షణలో ఉంచి, ఫంగస్ నియంత్రణకు అవసరమైన మందులతో పాటు మధుమేహాన్ని అదుపులో ఉంచే చికిత్స అందించారు.

**45 రోజుల సమష్టి వైద్యం**

బాలిక ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పిల్లల వైద్యులు, శస్త్రచికిత్స నిపుణులు, అంతఃస్రావ గ్రంథుల నిపుణులు, చిత్రీకరణ వైద్యులు, మూత్రపిండాల వైద్యులు, సూక్ష్మజీవుల వ్యాధుల నిపుణులు సమన్వయంతో చికిత్స కొనసాగించారు. 45 రోజులపాటు అందించిన సమగ్ర వైద్య సేవల ఫలితంగా బాలిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడి పూర్తిగా కోలుకుంది. ప్రస్తుతం ఆరోగ్యంగా ఇంటికి చేరినట్లు వైద్యులు తెలిపారు.

**వైద్య బృందానికి అభినందనలు**

చికిత్స ప్రక్రియలో పిల్లల వైద్య విభాగం వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో పాటు జీర్ణాశయ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ జయపాల్‌రెడ్డి, అంతఃస్రావ గ్రంథుల నిపుణురాలు డాక్టర్ కల్యాణి, చిత్రీకరణ వైద్య నిపుణుడు డాక్టర్ అంకమరావు, మూత్రపిండాల వైద్య నిపుణుడు డాక్టర్ వరప్రసాద్, సూక్ష్మజీవుల వ్యాధుల నిపుణురాలు డాక్టర్ ఉమ తదితరులు కీలక పాత్ర పోషించారు.

బాలికకు క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతమైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఎన్ఆర్ఐ యాజమాన్యం అభినందించింది.

విలేకరుల సమావేశంలో ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల సురేంద్ర, కోశాధికారి సోము కృష్ణమూర్తి, ప్రధాన పరిపాలనా అధికారి, విశ్రాంత ఐపీఎస్ అధికారి అంజనీ కుమార్, బాపిరెడ్డి, ఎన్ఆర్ఐ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎన్. లక్ష్మి, ఎన్ఆర్ఐ జనరల్ ఆసుపత్రి వైద్య పర్యవేక్షణాధికారి డాక్టర్ జి. శ్రీనివాసరావు, ఉప వైద్య పర్యవేక్షణాధికారి డాక్టర్ కేవీఎస్ కుమార్ చౌదరి తదితరులు.

# ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ విద్యా వికాస యజ్ఞం



చదువే ఆయుధం.. ప్రతిభకు ప్రోత్సాహం.. పేద బిడ్డల భవిష్యత్తే

30 కేంద్రాల్లో 843 మందికి ఉచిత బోధన.. 40 ఉన్నత పాఠశాలల్లో

అదనపు తరగతుల నిర్వహణ...

మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్

చదువుల నుంచి ఉద్యోగాల వరకు... విద్యార్థుల భవిష్యత్తుకు

సంస్కృతి సేవా సంస్థ ద్వారా చదువుల నుంచి ఉద్యోగాల కల్పన వరకు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వెనుకబడిన శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ ప్రభుత్వ విద్యారంగంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి, స్థానిక శాసన సభ్యుడు సత్యకుమార్ యాదవ్ స్ఫూర్తిదాయక కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అదనపు బోధన, ఉచిత సైకిళ్లు, పరీక్ష ఫీజు చెల్లింపు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి వసతి కల్పించడంతోపాటు యువతకు సివిల్స్ ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు అందేలా చేయడంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. తన కుమార్తె పేరుతో నెలకొల్పిన సంస్కృతి సేవా సమితి ద్వారా 15 ఏళ్ల నుంచి విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తున్న మంత్రి.. తాజాగా 'విద్యా వికాసం', 'విద్యా వాహిని' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సంస్కృతి సేవా సమితి సహకారంతో 5 మండలాల్లో 30 ఉచిత బోధనా కేంద్రాల ద్వారా 843 మంది విద్యార్థులకు అదనపు బోధన అందుతోంది. మరో 40 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 'విద్యా వాహిని' అమలవుతోంది.

**చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక శ్రద్ధ :** పాఠశాల తర్వాత విద్యార్థులకు అదనపు బోధన అందిస్తూ, ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి ప్రత్యేక సహాయం చేస్తున్నారు. ప్రాథమిక విద్యలో పట్టు పెంచడంతోపాటు చదువులో సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించారు. ధర్మవరం పట్టణం, ధర్మవరం గ్రామీణం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో 30 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 30 కేంద్రాలకు 30 మంది స్థానిక బోధకులను ఎంపిక చేశారు. జులైలో ఏర్పాట్లు పూర్తి చేసి ఆగస్టు 10 నుంచి కేంద్రాల్లో బోధన ప్రారంభమైంది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, మాట్లాడే నైపుణ్యం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంచేలా శిక్షణ ఇస్తున్నారు. వారి ప్రతిభ, ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు ఉన్నత చదువులు, పోటీ పరీక్షలపై అవగాహన కల్పించనున్నారు.

**40 ఉన్నత పాఠశాలల్లో 'విద్యా వాహిని' :** 'విద్యా వాహిని' ద్వారా 40 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల చదువు, వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల హాజరు, చదువులో పురోగతిని పరిశీలిస్తూ అవసరమైన సహాయం అందించనున్నారు.

**2 వేల మందికి ఉచిత సైకిళ్లు :** సంస్కృతి సేవా సమితి ద్వారా ధర్మవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న సుమారు 2 వేల మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఇందుకోసం సుమారు రూ.98 లక్షలు ఖర్చు చేశారు. 41 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 2,087 మంది విద్యార్థుల పరీక్ష ఫీజు రూ.2,60,875 చెల్లించారు. దీంతో పేద విద్యార్థులపై పరీక్ష ఫీజు భారం లేకుండా చేశారు.

**పాఠశాలల్లో వసతుల కల్పన :** ధర్మవరంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యం కోసం రూ.35 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించారు. పాఠశాలలు, వసతిగృహాల్లో శుద్ధి నీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోతుకుంట బీసీ కాలనీలో గంటకు 2,500 లీటర్లు, కేతిరెడ్డి కాలనీలో గంటకు 1,000 లీటర్ల సామర్థ్యంతో నీటి కేంద్రాలను రూ.20 లక్షలతో ఏర్పాటు చేశారు. మరో ఐదు నీటి యంత్రాలకు రూ.15 లక్షలు వెచ్చించారు.

**యువతకు సివిల్స్, బ్యాంకు పరీక్షల్లో ఉచిత శిక్షణ :** బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో డిగ్రీ పూర్తి చేసిన ప్రతిభావంతులైన సుమారు 25 మందిని ఎంపిక చేసి రెండేళ్ల సివిల్స్ శిక్షణ అందిస్తున్నారు. ఉచిత శిక్షణ, ఇతర ఖర్చులు కలిపి రెండేళ్లకు సుమారు కోటి రూపాయలు వ్యయం చేయనున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాల ద్వారా వేలాది మంది యువత ఉద్యోగాలు పొందారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన 35 మందికి బ్యాంకు పరీక్షలకు కూడా ఉచిత శిక్షణతో పాటు, వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.



Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467